# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 44 | బుధవారం 15, అక్టోబర్ 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



# ప్రభాకర్‌రావుకు బిగిస్తున్న ఉచ్చు

## పాస్‌వర్డ్ మర్చిపోయాను అంటే కుదరదు.. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు స్పష్టం

**సిట్ పిలిచినప్పుడు ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పాస్‌వర్డ్ రీసెట్ చేయాలని సూచన**

**ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించడం లేదని కోర్టుకు తెలిపిన తెలంగాణ ప్రభుత్వం**

**తదుపరి విచారణ వరకు ప్రభాకర్ రావు అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కొనసాగింపు**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ టి. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన తన ఐక్లౌడ్ సహా ఇతర క్లౌడ్ ఖాతాల ఐడీ, పాస్‌వర్డ్‌లను ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) తప్పనిసరిగా అందించాలని మంగళవారం స్పష్టం చేసింది. ఈ కేసులో ఆయన అరెస్ట్‌పై మధ్యంతర రక్షణను పొడిగిస్తూనే, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఆదేశించింది.

తాను తన ఐక్లౌడ్ ఖాతా పాస్‌వర్డ్‌ను మర్చిపోయానని, అది చాలా పాతదని ప్రభాకర్ రావు తరఫు

..మిగతా 2లో



## కిక్కివ్వని

# మద్యం టెండర్లు!

## రాష్ట్రంలో నత్తనడకన దరఖాస్తులు కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో మద్యం సిండికేట్లు

ఔత్సాహికులకు బెదిరింపులు

హైడ్రా దెబ్బకు మద్యం వ్యాపారం విలవిల..

'రియల్' దెబ్బతో లిక్కర్ బిజినెస్ వైపు చూడని యూత్

బీఆర్ఎస్ హయాంలో 1.32 లక్షల దరఖాస్తులు

ఈసారి ఇప్పటివరకు వచ్చింది 6,893 అప్లికేషన్లే!

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

రాష్ట్రవ్యాప్తంగా మద్యం టెండర్లు నత్తనడకన సాగుతున్నాయి. 2,620 మద్యం దుకాణాల లైసెన్సుల కోసం నోటిఫికేషన్ వెలువడి 17 రోజులవుతున్నా, ఇప్పటి వరకు 6,893 దరఖాస్తులే దాఖలైనట్టు ఎక్సైజ్ శాఖ వెల్లడించంది. రాష్ట్ర సగటు లెకల ప్రకారం.. ఒకో మద్యం దుకాణానికి 2.63 దరఖాస్తులే దాఖలయ్యాయి. గత ప్రభుత్వంలో

..మిగతా 2లో



02

## 18న నియామక పత్రాలు

అక్టోబర్ 18న శిల్పకళా వేదికలో గ్రూప్-2 నియామక పత్రాల కార్యక్రమం

సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాల అందజేత

782 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాల ప్రదానం

ఏర్పాట్లపై సీఎస్ సమీక్షా సమావేశం



## ఆడబిడ్డ అయిన మాగంటి సునీతను అవమానిస్తారా..?

మాగంటి సునీతపై మంత్రుల వ్యాఖ్యలపై శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం

"ఆడబిడ్డను అవమానించడం సిగ్గుచేటు"

"మంత్రులు వెంటనే క్షమాపణ చెప్పాలి"

మేయర్ గద్వాల విజయలక్ష్మిపై కూడా విమర్శలు

02

## మాగంటి సునీతకు బీ ఫామ్ అందజేసిన కేసీఆర్

**జూబ్లీహిల్స్ ఉపఎన్నిక.. మాగంటి సునీతకు బీఆర్ఎస్ బీ-ఫామ్**

**పార్టీ బీ-ఫామ్ అందజేస్తూ 40 లక్షల చెక్ ఇచ్చిన కేసీఆర్**

**నామినేషన్ల ప్రక్రియ ప్రతీ రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు**

**నేడు నామినేషన్ వేయనున్న మాగంటి సునీత గోపీనాథ్**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగంటి సునీతకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీ ఫామ్ అందజేశారు. ఎన్నికల వ్యయం కోసం పార్టీ తరఫున రూ. 40 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాగంటి సునీతతో పాటు ఆమె



02

## సీఎం మాటలు నీటి మూటలేనా..?

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై హరీష్ రావు విమర్శలు

గ్రీన్ చానెల్ నిధులు విడుదల చేస్తామన్న సీఎం మాటలు నీటి మూటలేనా?

కమీషన్లు రావనే గురుకులకు నిధులు కేటాయించడం లేదా?

హామీలతో మభ్యపెట్టడం, ఆ తర్వాత మాట మార్చడం ఇదే రేవంత్ సిద్ధాంతం : హరీష్ రావు



02

## ప్రజలు బీఆర్ఎస్‌కి గట్టి బుద్ధి చెప్పబోతున్నారు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌కు గట్టి దెబ్బ తగలనుంది

పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

మాగంటి కన్నీటి రాజకీయాలు ఫలించవు

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కి మరో షాక్ తప్పదు : మంత్రి పొన్నం



02


# ఈ ఫేక్ ఓటర్లలో మైనర్లు కూడా..

తెలంగాణ భవన్ లో ఓటు చోరీ అంశంపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రెసెంటేషన్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతుంది..

కాంగ్రెస్ ఎన్ని అడ్డదారులు తొక్కినా గెలిచేది మాత్రం బీఆర్ఎస్..

పూర్తి ఆధారాలతో చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ కి వినతి పత్రం ఇచ్చాను : కేటీఆర్





**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఓటు చోరీ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్ లో జరిగిన ప్రత్యేక సమావేశంలో బీఆర్ఎస్ కేటీఆర్ ఓటు చోరీ అంశంపై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్

..మిగతా 2లో

# కవిత తెలంగాణ యాత్ర.. ఎప్పుడంటే..?

అక్టోబర్ చివరివారంలో యాత్ర ప్రారంభం

తెలంగాణలో అన్ని జిల్లాల మీదుగా యాత్ర

కేసీఆర్ ఫోటో లేకుండా ప్రొ. జయశంకర్ ఫోటోతో యాత్ర పోస్టర్లు


మేధావులు, విద్యావంతులతో భేటీలు

నేడు యాత్ర పోస్టర్ విడుదల చేయనున్న కవిత

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ యాత్ర పేరిట రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో యాత్ర

..మిగతా 2లో



# ప్రభాకర్‌రావుకు బిగిస్తున్న ఉచ్చు

**మొదటిపేజీ తరువాయి**

న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం, సిట్ ఎప్పుడు పిలిచినా ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పాస్‌వర్డ్‌ను రీసెట్ చేసి, యాక్టివేట్ చేయాలని ఆదేశించింది. విచారణ బృందానికి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని స్పష్టం చేసింది.



విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించకపోవడం వల్ల కేసులో పురోగతి లేదని తెలిపారు. ఆయన తన డివైజ్‌లను ఫార్మాట్ చేసి కీలకమైన ఎలక్ట్రానిక్ ఆధారాలను నాశనం చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఈ ఆరోపణలను ప్రభాకర్ రావు తరపు న్యాయవాది డి.ఎస్. నాయుడు ఖండించారు. తన క్లయింట్ వ్యక్తిగత ఐక్లౌడ్ పాస్‌వర్డ్ మినహా అడిగిన అన్ని వివరాలనూ సిట్‌కు ఇచ్చారని, ఇప్పటికే 11 సార్లు విచారణకు హాజరై 18 గంటల పాటు ప్రశ్నలకు సమాధానమిచ్చారని తెలిపారు. భద్రతా నిబంధనల ప్రకారమే డిపార్ట్‌మెంట్ కంప్యూటర్ నిపుణులు డేటాను తొలగించారని, అందులో తన క్లయింట్ పాత్ర లేదని వివరించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభాకర్ రావు నేతృత్వంలోని ప్రత్యేక బృందం ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, జర్నలిస్టులు, చివరికి న్యాయమూర్తుల ఫోన్లను కూడా అక్రమంగా ట్యాపింగ్ చేసిందన్నది ప్రధాన ఆరోపణ. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత ప్రభాకర్ రావు తన పదవికి రాజీనామా చేసి అమెరికా వెళ్లారు. ఈ కేసు వెలుగులోకి రావడంతో ఆయన పేరు నిందితుల జాబితాలో చేరింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో జూన్ 8న భారత్‌కు తిరిగి వచ్చి విచారణను ఎదుర్కొంటున్నారు.

# ప్రజలు బీఆర్ఎస్‌కి గట్టి బుద్ధి చెప్పబోతున్నారు

- **జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌కు గట్టి దెబ్బ తగలనుంది**
- **పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం**
- **మాగంటి సునీత కన్నీటి రాజకీయాలు ఫలించవు**
- **జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కి మరో షాక్ తప్పదు : మంత్రి పొన్నం**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ప్రజలు భారత రాష్ట్ర సమితికి (బీఆర్ఎస్) గట్టి బుద్ధి చెప్పబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి పరంగా ఏ మాత్రం ముందుకు సాగలేదని, ఇప్పుడు ప్రజలే ఆ విఫలతకు తీర్పు ఇవ్వబోతున్నారని అన్నారు.

అంతేకాకుండా.. "జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ పార్టీ గూబ గుయ్యిమనేట్లు ప్రజలు తీర్పు ఇవ్వబోతున్నారు. ఈ ఉప ఎన్నికతో ఆ పార్టీ చిరునామా గల్లంతవుతుంది. పదేళ్ల పాలనలో అభివృద్ధి పేరుతో ఒక్క రోడ్డు సరి చేయలేని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఓట్ల కోసం నటన చేస్తున్నారు," అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే ఆ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారని గుర్తుచేశారు. "అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడగొట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూడా బుద్ధి చెప్పారు. అయినా ఇంకా నేర్చుకోలేదు," అని పొన్నం వ్యాఖ్యానించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలకూ ప్రజలు సరైన పాఠం చెప్పబోతున్నారని ఆయన స్పష్టం చేశారు. "జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్ల నమోదుకు బాధ్యత బీఆర్ఎస్, బీజేపీలదే. మాగంటి సునీత కంటతడి పెట్టిస్తూ గులాబీ పార్టీ ఓట్లు దండుకోవాలని చూస్తోంది. కానీ ఈసారి ఓటర్లు మోసపోవడం లేదు," అని తీవ్ర విమర్శలు గుప్పించారు.

# సీఎం మాటలు నీటి మూటలేనా?

- **రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై హరీష్ రావు విమర్శలు**
- **గ్రీన్ చానెల్ నిధులు విడుదల చేస్తామన్న సీఎం మాటలు నీటి మూటలేనా?**
- **కమీషన్లు రావనే గురుకులకు నిధులు కేటాయించడం లేదా?**
- **హామీలతో మభ్యపెట్టడం, ఆ తర్వాత మాట మార్చడం ఇదే రేవంత్ సిద్ధాంతం : హరీష్ రావు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్రంలోని గురుకులాలపై కొనసాగుతున్న సమస్యలను తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా, ముఖ్యమంత్రి గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలాగా మారాయని, కేటాయించిన నిధులు సిబ్బంది వేతనాలు, వసతి గృహాల మరమ్మతులు, అత్యవసర పనుల కోసం సరైన విధంగా ఉపయోగించబడలేదని అన్నారు. హరీష్ రావు మాట్లాడుతూ.. కమీషన్లు రావనే గురుకులకు నిధులు కేటాయించడం లేదా? మీ 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతి దిగజార్చబడిందన్నారు. సమస్యలతో నిత్యం విద్యార్థులు రోడ్డెక్కడం, నిత్యవసరాలు అందకపోవడం ప్రస్తుత ప్రభుత్వ నిర్వాహణపై తీవ్ర చిహ్నంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. రాష్ట్రంలోని 1024 గురుకులాలకు కేవలం 60 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని సిగ్గుచేటుగా చూస్తున్నామన్నారు హరీష్ రావు. రేవంత్ రెడ్డికి ఆరున్నర లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఉన్న గురుకులాలకు కనీసం 100 కోట్లు కేటాయించే మనసు రాలేదా? అని ప్రశ్నించారు. మొదటి దృష్ట్యా, అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల అద్దె బకాయిలు, పెండింగ్‌లో ఉన్న తాత్కాలిక సిబ్బంది వేతనాలు, మెస్ చార్జీలు, స్టిచ్చింగ్, కాస్మోటిక్ ఛార్జీలు ఇంకా చెల్లించని విషయాలను ఆయన డిమాండ్ చేశారు. గణితం ఉపాధ్యాయులు నియమించడంలో ఆలస్యం, విద్యార్థుల నిరసనలు, పురుగులన్నం సమస్యలు ఇలా కొనసాగుతున్నందుకు ప్రభుత్వం పట్టింపు వహించాలన్నారు. ఫోటోలకు ఫోజులు ఇవ్వడం, ఏదో చేస్తున్నట్లు ప్రచారం చేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావు అని ఆయన వ్యాఖ్యానించారు.

రేవంత్ రెడ్డి పాలనలో గురుకులాలను విష వలయాలుగా మార్చారు, అపఖ్యాతిని మూటగట్టారని ఆయన ఆరోపించారు. గ్రీన్ చానెల్ ద్వారా బిల్లులు, వసతి గృహాలకు నిధులు చెల్లిస్తామని చెప్పిన మాటలు ఎప్పుడైతే కార్యరూపం దాల్చుతాయి? అని హరీష్ రావు ప్రశ్నించారు. గురుకులాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# కిక్కెవ్వని మద్యం టెండర్లు!

**మొదటిపేజీ తరువాయి**

ఇవే మద్యం దుకాణాలకు 1.32 లక్షల దరఖాస్తులొచ్చాయి. నాడు రాష్ట్రంలో ప్రతి దుకాణానికి సగటున 51 దరఖాస్తులొచ్చాయి. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 2,585 దరఖాస్తులు దాఖలవగా.. అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లాలో 174 వచ్చాయి. రాబోయే నాలుగు రోజుల్లో భారీ ఎత్తున దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ శాఖ అధికారులు చెప్తున్నారు. కానీ, ఈసారి కనీసం ఒక లక్ష దరఖాస్తులు కూడా దాటే పరిస్థితి కనిపించడం క్షేత్రస్థాయి అధికారులు భావిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్.. ఇలా ప్రతి జిల్లాలోనూ అదే పరిస్థితి కనిపిస్తున్నదని చెప్తున్నారు. ఈ పరిస్థితికి కాంగ్రెస్ నేతల మద్దతుతో భారీఎత్తున సిండికేట్లు ఏర్పడి టెండర్లు వేయకపోవడం, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వైఫల్యం, రియల్‌ఎస్టేట్ బూమ్ పడిపోవటంతో కొత్త వాళ్లు మద్యం వ్యాపారంలోకి రాకపోవడం, దరఖాస్తు ధర రూ.3 లక్షలకు పెరగడం, త్వరలోనే ప్రభుత్వం మరోసారి మద్యం ధరలు పెంచబోతున్నదనే సంకేతాలు వెలువడుతుండటం కారణమని 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది.

**నత్తనడకన దరఖాస్తుదారులు**

పాత మద్యం లైసెన్స్‌కు ఈ నెల 30తో గడువు తీరిపోతున్నది. 20252027 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 20న నోటిఫికేషన్, సెప్టెంబర్ 26న షెడ్యూల్ విడుదల చేసింది. మద్యం దుకాణాలకు దరఖాస్తులు సమర్పించడానికి అక్టోబర్ 18 వరకే గడువు ఉన్నది. ఈ నెల 23న డ్రా తీస్తారు. ఇంకా నాలుగు రోజుల సమయం ఉండటంతో టెండర్ల సంఖ్య పెంచేందుకు ఎక్సైజ్ అధికారులు మద్యం వ్యాపారులకు ఫోన్లు చేసి టెండర్లు వేయాలని సూచిస్తున్నారు. సోమవారం సప్తమి మంచిరోజు అని వ్యాపారులకు ఫోన్లు చేసి ప్రోత్సహించినా రాష్ట్రవ్యాప్తంగా 1,280 దరఖాస్తులకు మించి రాలేదని తెలిసింది. దీంతో 16న దశమి, 17న ఏకాదశి, 18న ద్వాదశి మంచి ముహూర్తాలు, తిథులు ఉన్నాయని చెప్తూ అధికారులు ఫోన్లు చేస్తున్నారట. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 2023లో 8,128 అప్లికేషన్లు రాగా.. ఈసారి 3,056 దరఖాస్తులే వచ్చాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో క్రితంసారి 10,734 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 435 దరఖాస్తులే వచ్చినట్టు తెలిసింది.

**కాంగ్రెస్ నేతల చేతుల్లో సిండికేట్లు**

కాంగ్రెస్ నేతల చేతుల్లోకి వెళ్లిపోయిన మద్యం పాత వ్యాపారులు సిండికేట్లుగా మారినట్టు తెలుస్తున్నది. స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో ఏ జిల్లాకు ఆ జిల్లాలో జట్టుకట్టిన సిండికేట్లే మద్యం దరఖాస్తులను శాసిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. దరఖాస్తు చేసుకొనేందుకు పటాన్‌చెరులో ఒక మద్యం వ్యాపారి డీడీ తీయగా, సదరు వ్యాపారిని సిండికేట్ బెదిరించింది. దీంతో ఆ డీడీని ఏం చేయాలో తెలియని స్థితిలో ఆయన కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో రూ.కోట్లకు కోట్లు ధారపోసి, వందలకు వందల టెండర్లు వేసి డబ్బు పోగొట్టుకునే బదులు, పదుల సంఖ్యలో టెండర్లు వేయాలని ఔత్సాహికులు నిర్ణయించుకున్నట్టు తెలిసింది. స్థానిక ఎమ్మెల్యే మద్దతుతో లైసెన్సీకి ఎంతోకొంత ముట్టచెప్పి దుకాణం తీసుకోవడమే ఉత్తమం అనే నిర్ణయానికి కొందరు మద్యం వ్యాపారులు వచ్చినట్టు సమాచారం.



తాజాగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే అంతర్గత ఉద్దేశం ఏమిటో తెలియదు కానీ, మద్యం టెండర్ల మీద రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి, సొంత నిబంధనలు అమల్లోకి తెచ్చారు. ఈ నిబంధనలు మద్యం సిండికేట్లను ప్రోత్సహించేవిధంగా ఉన్నాయని స్థానికులు చెప్తున్నారు. ప్రతి పాలసీలో 15 నుంచి 20% వరకు యువత కొత్తగా మద్యం వ్యాపారంలోకి వస్తున్నదని ఎక్సైజ్ నివేదికలు చెప్తున్నాయి. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ క్షేత్రస్థాయిలో ఇటువంటి సిండికేట్లను ఎప్పటికప్పుడు గుర్తించి ధ్వంసం చేయాల్సి ఉన్నది. కానీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారికి, క్షేత్రస్థాయి సిబ్బందికి మధ్య అసలు కమ్యూనికేషనే లేనట్టు తెలిసింది. క్షేత్రస్థాయి ఎన్‌ఫోర్స్‌మెంట్ లేక సిండికేట్లు బలపడినట్టు, వారి ప్రభావంతోనే మద్యం దరఖాస్తులు వెనుకబడినట్టు తెలుస్తున్నది.


**వ్యాపారంపై 'హైడ్రా' తీవ్ర ప్రభావం**

హైడ్రా కూల్చివేతలు ఎక్సైజ్ వ్యాపారాన్ని దెబ్బతీయడానికి తోడు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వీర్యం కావడంతోనే మద్యం వ్యాపారం మీద తీవ్ర ప్రభావం చూపిస్తున్నట్టు 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైంది. రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచడం కూడా మరో కారణమని చెప్తున్నారు. హైడ్రా కూల్చివేతలతో గత రెండేండ్లుగా రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం కోలుకోనివిధంగా దెబ్బతిన్నది. దీంతో టెండర్లు వేయడానికి చాలామంది ఆసక్తి చూపడంలేదని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం బాగున్న రోజుల్లో.. అక్కడ సంపాదించిన డబ్బును యువత మద్యం వ్యాపారంలో పెట్టుబడి పెట్టేది. 5 నుంచి 10 మంది యువత ఒక గ్రూపుగా ఏర్పడి 20 నుంచి 30 దుకాణాలకు దరఖాస్తు చేసేవారు. అప్పట్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా గ్రూపులుగా ఏర్పడి మద్యం టెండర్లు వేసేవారని చెప్తున్నారు. మరోవైపు ప్రభుత్వం మద్యం ధరలు పెంచడం, మద్యం ఉత్పత్తి కంపెనీలకు దాదాపు రూ.3,500 కోట్ల బకాయి పడటంతో ఆయా కంపెనీలు డిమాండ్‌కు తగిన మద్యం ఉత్పత్తి చేయలేకపోతున్నాయని, ఇది వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నదని వ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# కవిత తెలంగాణ యాత్ర.. ఎప్పుడంటే..?

**మొదటిపేజీ తరువాయి**


చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అక్టోబర్ చివరి వారంలో తెలంగాణ యాత్ర ప్రారంభించనున్న కవిత తెలిపారు. ఇదిలా ఉంటే.. యాత్ర పోస్టర్లలో కేసీఆర్ ఫోటో లేకుండా, ప్రొఫెసర్ జయశంకర్ ఫోటోతో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఇది యాత్రలో విద్యావంతులు, మేధావులతో భేటీలను మరింత ప్రతిష్ఠాత్మకంగా మార్చే విధంగా ఉండనుంది. కవిత ఈ యాత్రలో తెలంగాణ సాంప్రదాయ, విద్యా, సాంకేతిక రంగాల్లో కృషిచేసిన వేతరులను, ప్రముఖ మేధావులను కలుస్తూ ప్రజలకు ప్రత్యక్షంగా సందేశాలు చేరుస్తారని తెలుస్తోంది. రేపు యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ యాత్రకు సంబంధించిన అన్ని వివరాలు, షెడ్యూల్‌లు, సమావేశాల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.



# ఈ ఫేక్ ఓటర్లలో మైనర్లు కూడా..

**మొదటిపేజీ తరువాయి**

అడ్డదారులు తొక్కుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్ని అడ్డదారులు తొక్కినా గెలిచేది మాత్రం బీఆర్ఎస్సే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పూర్తి ఆధారాలతో చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ కి వినతి పత్రం ఇచ్చానని, గత అసెంబ్లీ ఎన్నికల్లో 3 లక్షల 75 వేల ఓటర్లు ఉండగా.. ఇప్పుడు 3 లక్షల 98 వేల ఓట్లు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు.




అంతేకాకుండా.. అసాధారణంగా 23 వేల ఓట్లు ఎలా పెరిగాయని, మొన్న కాంగ్రెస్ పార్టీ తరుపున నవీన్ యాదవ్ ఓటర్ ఐడిలు పంచాడని, ఓటర్ ఐడీ పంచే అధికారం అతనికి ఎవరు ఇచ్చారని ఆయన అన్నారు. అవన్నీ ఫేక్ ఓటర్ ఐడీ కార్డ్స్ అని ఎన్నికల అధికారులు అంటున్నారన్నారు. అతనిపై ఎన్నికల అధికారులు కేసు కూడా నమోదు చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఫేక్ ఓటర్లలో మైనర్లు కూడా ఉన్నారని కేటీఆర్ వెల్లడించారు. సంస్కృతి అపార్ట్మెంట్ లో 43 ఓటర్లు ఉన్నారని, కానీ అక్కడికి వెళ్లి ఎంక్వయిరి చేస్తే.. వాళ్లెవరు అక్కడ లేరని చెబుతున్నారన్నారు. ఇదేకాకుండా.. మరొక చోట బూత్ నెంబర్ 125 లో ఒకటే అడ్రెస్స్ లో 23 ఓట్లు ఉన్నాయని, అక్కడ కూడా ఈ 23 మంది ఎవరో అక్కడి వాళ్లకు తెలియదు అని చెబుతున్నారన్నారు. ఆ ఇంటి యజమానికి కూడా వాళ్లెవ్వరో తెలియదు అని సమాధానం ఇస్తున్నారన్నారు. ఇవ్వన్నీ ఫేక్ ఓట్లు అని కేటీఆర్ అన్నారు. 118 ఇంటి నెంబర్ కాంగ్రెస్ పార్టీ నేత ఇంటి అడ్రస్‌పై 32 ఫేక్ ఓటర్ ఐడీలు ఉన్నాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# ఆడబిడ్డ అయిన మాగంటి సునీతను అవమానిస్తారా..?

- **మాగంటి సునీతపై మంత్రుల వ్యాఖ్యలపై శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం**
- **"ఆడబిడ్డను అవమానించడం సిగ్గుచేటు"**
- **"మంత్రులు వెంటనే క్షమాపణ చెప్పాలి"**
- **మేయర్ గద్వాల విజయలక్ష్మిపై కూడా విమర్శలు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లకు మానవత్వం ఉందా? వాళ్లు మనుషులేనా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డ అయిన మాగంటి సునీతను అవమానించడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోపన్న అమర్ రహే అంటుంటే, తన భర్త గోపినాథ్‌ను గుర్తు చేసుకొని మాగంటి సునీత ఏడుస్తుంటే డ్రామా అంటారా తుమ్మల నాగేశ్వరరావు? కమ్మ సామాజిక వర్గం ఓటు వేస్తే గెలిచిన తుమ్మల, అదే వర్గానికి చెందిన నేత గోపినాథ్ సతీమణిని డ్రామా అంటారా? అని ప్రశ్నించారు. మాగంటి సునీతకు మంత్రుల వ్యాఖ్యలు తీవ్ర మనస్తాపం కలిగించాయని, వారు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రుల మాటలను తెలంగాణ ఆడబిడ్డలు గమనించాలి అని ఆయన వ్యాఖ్యానించారు.




అలాగే, ప్రెస్ మీట్ సమయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి మంత్రుల పక్కనే కూర్చున్నా, ఆడబిడ్డ అవమానింపబడుతుండగా మౌనంగా ఉన్నారని గౌడ్ విమర్శించారు. రాజీవ్ గాంధీ చనిపోయినప్పుడు పార్టీలకతీతంగా అందరం బాధ పడ్డామని, ఇప్పుడు మాగంటి సునీత తన భర్తను గుర్తుచేసుకొని ఏడుస్తుంటే దాన్ని డ్రామా అంటారా? ఇది సిగ్గుచేటు అని మండిపడ్డారు. మాగంటి సునీత భావాలను దెబ్బతీసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

# మాగంటి సునీతకు బీ ఫామ్ అందజేసిన కేసీఆర్

**మొదటిపేజీ తరువాయి**

కుమార్తె, కుమారుడు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత, కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్ పోటీ చేస్తున్నారు. బీజేపీ తమ పార్టీ తమ అభ్యర్థిని ఇంకా ప్రకటించాల్సి ఉంది. జూబ్లీహిల్స్‌లో నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ప్రస్తుత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది.



# 18న నియామక పత్రాలు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

గ్రూప్2 అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్టోబర్ 18న గ్రూప్2 ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరగనుంది. మొత్తం 782 మంది అభ్యర్థులు ఈ సందర్భంగా తమ నియామక పత్రాలను స్వీకరించనున్నారు.

కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్టిఫికెట్‌ల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే రెవెన్యూ, హోమ్, జీఏడీ శాఖల మధ్య సమన్వయం కల్పించి, అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.





# నవతరానికి ప్రేరణ అబ్దుల్ కలాం

ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, అత్యున్నత శిఖరాలను అధిరోహించిన మహనీయుల జీవితం నేటి నవతరానికి స్ఫూర్తిగా నిలుస్తుంది. ఆయన అందరిలా అతి సామాన్య కుటుంబంలో జన్మించాడు. బాల్యంలో అనేక ఒడిదుడుకులను, కష్టాలను ఎదుర్కొన్నాడు. మొక్కవోని దీక్షతో ఆత్మవిశ్వాసంతో విద్యాభ్యాసం కొనసాగించాడు. చిన్నప్పుడే ఒక స్థిరమైన లక్ష్యాన్ని ఏర్పరచుకున్నాడు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ఆ లక్ష్యం చేరాలని కలలు కన్నాడు. నిరంతర సాధన తో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు. భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసి అందరి మన్నలను అందుకున్న ఆ మహానుభావుడు చిన్నారులకు ప్రీతిపాత్రుడు. ఆయన జీవితమే నేటి నవ తరానికి ఒక ప్రేరణ, అందరూ ఏపీజే అబ్దుల్ కలాం అని పిలువబడే పేరు ఆయన అసలు పేరు (డాక్టర్ అవుల్ ఫకీర్ జైన్ లాబ్దిన్ అబ్దుల్ కలామ్ ) ఈయన తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం దగ్గర ఉన్న ధనుష్కోటిలో పుట్టాడు. సామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన పట్టుదల క్రమశిక్షణ, జ్ఞాన జిజ్ఞాసతో ఇంజనీరుగా శాస్త్రవేత్తగా భారత రాష్ట్రపతిగా తన సేవలను ఈ జాతికి అందించాడు. శాస్త్ర రంగంలో విశేష కృషి చేసినందుకు గాను పద్మభూషణ్, పద్మ విభూషణ్,తో పాటు దేశ అత్యున్నత పురస్కారం, భారతరత్నతోను భారత ప్రభుత్వం సత్కరించింది. దేశ విదేశాల్లోని విశ్వవిద్యాలయాలు, గౌరవ డాక్టరేట్లతో ఆయనను గౌరవించాయి. రామనాథపురంల హైస్కూల్లో స్థిరపడగానే తనలోని పది హేనే ళ్ళ జిజ్ఞాసి మేల్కొన్నాడు. 1950లో ఇంటర్మీడియట్ పరీక్షకు చదవడానికి తిరుచినాపల్లిలో ట్రీచి సెంట్ జోసెఫ్ కాలేజీలో చేరాడు. అబ్దుల్ కలాం అన్నయ్యకు ముస్తఫా కు ఒక కిరాణా దుకాణం ఉండేది. అప్పుడు ఆ కిరాణం దుకాణంలో ఉండి చదువుకుంటూ దుకాణాన్ని చూస్తుండేవాడు. ఇంటర్మీడియట్ పూర్తి అయిన తర్వాత నేరుగా ఇంజనీరింగ్ లో చేరవచ్చు, అప్పుడు అబ్దుల్ కలాం దక్షిణ భారతదేశమంతటిలోను సాంకేతిక విద్యకు తల మానిక లాంటి మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రవేశానికి దరఖాస్తు చేశాడు. ప్రవేశానికి ఎంపిక అయితే అయ్యాడు కానీ అటువంటి ప్రతిష్టాత్మక సంస్థలో చదవడం అంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. దాదాపు వెయ్యి రూపాయలు అన్న అవసరమవుతాయి. కానీ అది నా తండ్రికి తలకు మించిన భారం విషయం అనుకున్నాడు. అప్పుడు తన సోదరి జోహార తనకు తోడుగా నిలబడింది. తన బంగారు గాజులు గొలుసు కుదరపెట్టి ఆమె తనకు సహాయం చేసింది.నేను చదువుకోవాలన్న ఆమె ఆకాంక్ష నా సామర్థ్యం పై ఆమె నమ్మకం గాఢంగా నన్ను చలింప చేసాయి అనుకున్నాడు. అప్పుడు అబ్దుల్ కలాం నా సొంత సంపాదన మీదనే ఆమె గాజులు విడిపిస్తానని తన మనసులోఒట్టు పెట్టుకున్నాడు. తను చదువుకునే రోజుల్లో తనకు వచ్చే స్కాలర్షిప్పే నా జీవన భాగ్యరేఖ అని భావించాడు.అది గాని లేకపోతే నేను గాని చదువుకోవడం చాలా కష్టం అని అనుకున్నాడు. ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న తర్వాత డాక్టర్ అబ్దుల్ కలాం "మన విమానాన్ని మనమే తయారు చేసుకుందాం " అని తమిళంలో ఒక వ్యాసం రాశాడు. ఆ వ్యాసం అప్పుడు అందరినీ రేకెత్తించింది. ఆ పోటీలో గెలిచాడు, ప్రఖ్యాత తమిళ వారపత్రిక,ఆనంద వికటాన్ దివాన్ సంపాదకుడైన చేతుల మీదుగా మొదటి బహుమతి పొందాడు. డాక్టర్, అబ్దుల్ కలాం గ్రాడ్యుయేట్ ఏరోనటికల్ ఇంజనీరుగా కోర్సు పూర్తి చేసుకుని బయటకు వచ్చేసరికి రెండు అవకాశాలు వచ్చాయి.తన చిరకాల స్వప్నం నిజం చేసే రెండు ఉద్యోగ అవకాశాలు తన ముందుకు వచ్చాయి. ఒకటి సైనిక దళంలో ఉద్యోగం, రెండవది దక్షిణ మంత్రిత్వ శాఖ, ఆధ్వర్యంలో పనిచేసే సాంకేతిక ఉత్పాతక డైరెక్టర్ గా తనకు రెండు ఉద్యోగాలు ఒకేసారి వచ్చాయి. డాక్టర్ అబ్దుల్ కలాం రామేశ్వరం నుండి భారత రాష్ట్రపతిగా ఎదిగిన తన జీవిత చరిత్ర గురించి తెలుసుకొని తనను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం డాక్టర్ అబ్దుల్ కలాం ని మార్గ దర్శకంగా తీసుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



దేవులపల్లి రమేశ్
సిద్దిపేట, నంగునూర్
9963701294
(అక్టోబర్ 15 డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా.)

### వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో
## ధాన్యం కొనుగోలు



**మాసాయిపేట అక్టోబర్ 14 (ప్రజాస్వరం)**

మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామంలో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దార్ జ్యోతి,Ao కవిత, ఆర్ఐ ధన్ సింగ్ సొసైటీ డైరెక్టర్ ఊదండపురం నరసింహులు ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యంకు గిట్టుబాటు ధర కల్పించడం కోసమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని వారు తెలిపారు. రైతుల పండించిన ధాన్యం దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి





- **కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరగకుండా చూడాలి**
- **అంచనా అనుగుణంగా ట్రాన్స్పోర్ట్ సౌకర్యం కల్పించాలి**
- **బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్**

**మెదక్ అక్టోబర్ 14 (ప్రజా స్వరం)**

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వెంటనే మొదలు పెట్టాలని మంగళవారం మెదక్ జిల్లా బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాన కాలం సీజన్ లో కోటి 48 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా అంచనా వేసిందని అన్నారు. కోతలు మొదలు అవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా, ధాన్యం సేకరణలో ఇలాంటి లోటుపాట్లు జరగకుండా ముందుగానే ఐకెపి సెంటర్లు, సొసైటీలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. రవాణా కోసం లారీల సౌకర్యం ఉండేలా చూడాలని, ధాన్యం బస్తాలు, సుతిలీలు, లేబర్ ని ముందస్తుగానే ఏర్పాటు చేయాలన్నారు. రైతులు కల్లాలలోకి వచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసే విధంగా చూడాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధన కు మించి తూకం వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధ్యానం డబ్బులను రైతుల ఖాతాల్లో తొందరగా వేసి విధంగా చూడాలని అన్నారు. సన్నాలకు సంబంధించి గతంలో రైతుల అకౌంట్లో వేయని బోనస్ డబ్బులు వెంటనే వేసి, సన్న వడ్లకు బోనస్



లు వేయడంలో జాప్యం చేయకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతుల పంటలకు వెంటనే నష్ట పరిహారం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి, శ్రీనివాస్, మండల అధ్యక్షురాలు బెండ వీణ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు

# జూదం పై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి, 12 మంది అరెస్ట్

- **14,049 నగదు, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం**
- **జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు**

**మెదక్ అక్టోబర్ 14 (ప్రజా స్వరం)**

విశ్వసనీయ సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ పోలీసులు పాపన్నపేట్ మండలం యూసుఫ్‌పేట్ గ్రామ పరిధిలోని పౌల్ట్రీ ఫారమ్ సమీప ప్రాంతంలో బొమ్మా బొరుసు (జూదం) ఆడుతున్న వ్యక్తులపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో మొత్తం 12 మంది జూదగాళ్లను అదుపులోకి తీసుకొని, వారివద్ద నుండి రూ. 14,049 నగదు, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన వస్తువులు, అరెస్టయిన



12 మంది జూదగాళ్ల ను పాపన్నపేట్ పోలీస్ స్టేషన్ కు అప్పగించగా, తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ డీ.వి. శ్రీనివాసరావు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, బెట్టింగ్ వంటి కార్యకలాపాల వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ముఖ్యంగా యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపదించాలనే ఆలోచనలతో చెడు మార్గాలను ఎంచుకుంటున్నారని, కష్ట పడానిదే ఏది ఊరికే రాదని అన్నారు, ప్రజలు కూడా ఇలాంటి సమాచారాన్ని పోలీసులకు అందించి సహకరించాలని తెలిపారు.

# బాల్య వివాహాలు లేని గ్రామాలను తీర్చిదిద్దుదాం





- **వంద రోజులపాటు జిల్లాలో కార్యక్రమాలు**
- **క్షేత్రస్థాయిలో అధికారులు సహకరించేలా చర్యలు తీసుకోవాలని వినతి**
- **సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, అక్టోబరు 14(ప్రజాస్వరం):**

జిల్లాలో బాల్యవివాహాలు లేని గ్రామాలను రూపుదిద్దేందుకు ప్రభుత్వపరంగా తమకు సహాయ సహకారాలు సహకరించాలని సాధన ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ రమేశ్ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి రిక్వెస్ట్ లెటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ రమేశ్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి బాల్యవివాహాల నిర్మూలన ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని 50 గ్రామాల్లో 100 రోజులపాటు బాల్యవివాహాల ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలు లేని గ్రామాలను రూపుదిద్దేందుకు అన్ని పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తూ, బాల్య వివాహాలు లేని వెల్లడించారు. జిల్లాలో బాల్య వివాహాలు నిర్మూలనకు, బాలల హక్కుల కోసం పనిచేసే తమకు ప్రభుత్వపరంగా క్షేత్రస్థాయిలో అధికారులు సహకరించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు జిల్లా కోర్టులో డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ కార్యాలయంలో సైతం ప్రతిని అందజేశారు. గ్రామాల్లో నిర్వహించే బాల్యవివాహాల నిర్మూలన కార్యక్రమాలకు తమ మద్దతు ఉంటుందని డీఎల్ఎస్ఎ ప్రతినిధులు తెలిపారని రమేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సాధన సంస్థ ప్రతినిధులు నర్సింహులు, గుమ్మడి రమేశ్ తదితరులు ఉన్నారు.

# పులి దాడితో దూడ మృతి – అటవీ శాఖ నిర్లక్ష్యం పై రైతుల ఆగ్రహం

**దౌల్తాబాద్, అక్టోబర్ 14 (ప్రజాస్వరం):**

దౌల్తాబాద్ మండల పరిధిలోని లింగరాజుపల్లి గ్రామంలో పులి దాడితో దూడ మృతి చెందిన ఘటన గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేసింది. గ్రామానికి చెందిన పెరిమల నర్సింలు ప్రతిరోజు మాదిరిగానే తన పశువులను సోమవారం సాయంత్రం తాలంతో కట్టేసి పొలంలో ఉంచారు. అయితే మంగళవారం ఉదయం పశువులకు మేత వేసేందుకు వెళ్లగా ఒక లేగ దూడ మృతి చెందినది గమనించారు. దూడ శరీరంపై పులి గోర్లు, పళ్లు వేసిన దెబ్బల ముద్రలు స్పష్టంగా కనిపించినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినా, వారు “పులి తినలేదు” అంటూ నిర్లక్ష్యంగా స్పందించారని రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామస్థులు పులి సంచారం భయంతో రాత్రివేళ పొలాల్లో కాపలా కూర్చోవడానికే భయపడుతున్నామని, అటవీశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని, పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.





### దీపావళి పటాకులు అమ్మటానికి
# అనుమతులు తప్పనిసరి




- జినోమ్ వ్యాలీ సీఐ గోపగాని గురువయ్య

**శామీర్ పేట అక్టోబర్, 14(ప్రజాస్వరం)**

దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలికంగా పటాకుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, పర్మిషన్ కోసం దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని ఇన్ స్పెక్టర్ గోపగాని గురువయ్య అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బాణసంచా అమ్మకాలకు దుకాణదారులు 16వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవా లని సూచించారు. ముందస్తు అనుమతులు లేకుండా పటాకుల షాపులు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వారి దరఖాస్తులు తిరస్కరించబడుతాయి అని సీఐ గోపగాని గురువయ్య స్పష్టం చేశారు. వివరాలకు జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని అయన తెలిపారు.

# పారా త్రో బాల్ ఇండియా సారధిగా ధీరావత్ మహేష్

**శామీర్ పేట్ అక్టోబర్, 14(ప్రజాస్వరం)**



మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లింగాపూర్ తండాకు చెందిన దిరావత్ మహేష్ పారా త్రోబాల్ ఇండియా టీం కెప్టెన్ గా సెలెక్ట్ అయ్యాడు. డిసెంబర్ 6 తేదీ నుండి శ్రీలంకలోని రత్నపురలో జరిగే మొట్టమొదటి సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ ఛాంపియన్షిప్ పోటీలకు భారత జట్టు సారధిగా వ్యవహరించనున్నాడు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో భారత జట్టు కెప్టెన్ గా ఎంపిక చేసిన పారా త్రో బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ ప్రేమ్ కుమార్, కోచ్ సింగారపు బాబులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సౌత్ ఏషియన్ టోర్నమెంట్ లో రాణించి భారత పతాకాన్ని రెపరెపలాడిస్తామని తెలిపారు. నాకు అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహిస్తున్న నా తల్లిదండ్రులు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు.

### దడువాయిగా పనిచేయదలచిన వారు
# దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా మార్కెటింగ్ అధికారి



**వికారాబాద్, అక్టోబర్ 14(ప్రజా స్వరం ):**

తాండూర్ మార్కెట్ యార్డ్ నందు దడువాయిగా పనిచేయదలచిన వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి ఒక ప్రకటన తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ తాండూర్ నందు రైతు యొక్క సరుకును తూకం వేయుటకు నూతనముగా (09) మందికి దడువాయి(తూకము వేసే పని ) లైసెన్సులు జారీ చేయుటకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అనుమతించినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ తాండూర్ నందు దడువాయిగా పనిచేయదలచిన వారు అక్టోబర్ 22 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవలసిన అభ్యర్థుల విద్యార్హత కనీస పదవ తరగతి పూర్తి చేసి ఉండాలని ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు (35 ) సంవత్సరాల లోపు వారు మాత్రమే అర్హులని తెలిపారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత, మెడికల్ ఫిట్నెస్ మరియు వయసు నిర్ధారణ సర్టిఫికెట్లు జత చేయాలని ఆయన తెలిపారు. దరఖాస్తుల పరిశీలన మరియు అభ్యర్థుల ఎంపిక పూర్తిగా కలెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థికి కలెక్టర్ నిర్ణయించిన ప్రకారముగా వారు చేసిన పనికి అనుగుణంగా డబ్బులు చెల్లించడం జరుగుతుందని, రైతు ఉత్పత్తి యందు మినహాయించి చెల్లించబడుతుందని, వీరికి వ్యవసాయ మార్కెట్ కమిటీ నుండి గాని ఏ ఇతర కార్యాలయం నుండి గాని వేతనము చెల్లించబడదని ఆయన తెలిపారు. ఇతర సమాచార నిమిత్తము వ్యవసాయ మార్కెట్ కమిటీ తాండూర్ లేదా జిల్లా మార్కెటింగ్ అధికారి, కార్యాలయంలో పనివేళల్లో ఫోన్ నెంబర్ 7330733618 ద్వారా సంప్రదించవచ్చు నని జిల్లా మార్కెటింగ్ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

### తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా
# చిలుకు వేణుగోపాల్ రెడ్డి

**బెంగుళూరు, అక్టోబర్ 14(ప్రజా స్వరం ):**

సౌత్ ఇండియా మీడియా అసోసియేషన్ (సీమ) జాతీయ అధ్యక్షులు కె. ఆదినారాయమూర్తి ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర (202527) నూతన అధ్యక్షులుగా సౌత్ ఇండియా టైమ్స్ ఎడిటర్ చిలుకు వేణుగోపాల్ రెడ్డి నియమితులయ్యారు. ఆయన బాధ్యతల్ని సమర్థంగా నిర్వర్తిస్తారని, తెలంగాణ వ్యాప్తంగా 'సీమ' కార్యకలాపాల విస్తరణకు కృషి చేస్తారని ఆశిస్తున్నామని, వివిధ పత్రికలు, టెలివిజన్లలో పనిచేస్తున్న పాత్రికేయులు దైనందిని జీవనంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత్రికేయులకు కల్పిస్తున్న సదుపాయాల్ని వారు విస్తృత స్థాయిలో వినియోగించుకోవటానికి మీరు పాటుపడాలని 'సీమ' ప్రధాన కార్యదర్శి నకిరెకంటి స్వామి ఆకాంక్షించారు. చిలుకు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకుని వెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన అన్నారు.

### గిరిజన మహిళా హత్యాచారం,
# హత్య కేసులో నిందితుడి అరెస్టు






- జీవిత ఖైదు పడిన వ్యక్తే నిందితుడు
- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు
- రూరల్ సీఐ జార్జ్, సిబ్బంది, సీసీఎస్ టీం ఎస్పీ అభినందనలు

**మెదక్ అక్టోబర్ 14 (ప్రజా స్వరం)**

గిరిజన మహిళ లను వివస్త్రను చేసి హత్యాచారం హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు వెల్లడించారు. ఈ సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా ప్రధాన కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 న డయల్ 100 కాల్ వచ్చిందని ప్రకారం ఒక మహిళ ఏడుపాయల మూడవ బ్రిడ్జి దగ్గర గాలి అనిల్ కుమార్ వెంచర్ వెనుక ఒక మహిళ ను చెట్టుకు కట్టి పడేసి మహిళ అపస్మారక స్థితిలో ఉండటాన్ని స్థానికులు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. పోలీసు వారు వెళ్లి చూడగా ఒక మహిళ గాయపడి అపస్మారక స్థితిలో ఉండడం వల్ల ఆమెను వెంటనే పోలీసు వాహనంలో గవర్నమెంట్ హాస్పిటల్ మెదక్ షిఫ్ట్ చేయడం జరిగిందని చికిత్స పొందుతూ మహిళ మృతి చేసినట్లు తెలిపారు. ఈ కేసు ను చేధించేందుకు ఇద్దరు డీఎస్పీ లు, 3 సీఐ లు, 7 ఎస్ఐ లు, సీసీఎస్ బృందం & ఐడి పార్టీలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని అన్నారు. దర్యాప్తు సమయంలో సీసీ కెమెరాల ఆధారంగా మెదక్ ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని సిద్ధి వినాయక వైన్స్ షాప్ వద్ద ఉన్న ఫుటేజ్ ద్వారా నిందితుడిని గుర్తించి, అతను పాత నేరస్తుడి గా తేలడంతో ఈ నెల 11 న మెదక్ చర్చి వెనుక ప్రాంతంలో అరెస్టు చేశామని తెలిపారు.




నిందితుడు మెగావత్ ఫకిర నాయక్ ఈ నెల 10 సాయంత్రం సమయంలో గిరిజన మహిళ ను మెదక్ నుండి కూలి పని కోసం ఏడుపాయల దేవస్థానం దారిలోని 3 వ వంతెన సమీపంలో వెంచర్ వెనుక చెట్ల మధ్యకు తీసుకెళ్లి లైంగిక దాడి పాల్పడ్డాడని అన్నారు. అనంతరం ఆమెను చీర కట్టేసి మానభంగం చేసి రాయితో తలపై బలంగా కొట్టి హత మార్చి, ముక్కు పుడక దోచుకొని అక్కడి నుండి పోయాడని అన్నారు. అనంతరం మెదక్ చర్చి వెనకాల గల చెట్ల వద్ద కి తన బట్టలను చెట్లలో దాచి, స్నానం చేసి అక్కడే రాత్రి పడుకోవడం జరిగిందని అన్నారు. ఈ కేసు లో నిందితుడి నుండి ముక్కు పుడక, నిందితుడు వాడిన రాయి, కత్తి, నిందితుడి బట్టలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును వేగంగా చేదించినందుకు మెదక్ రూరల్ సీఐ జార్జ్, సిబ్బంది, సీసీఎస్ టీంకు ఎస్పీ అభినందనలు తెలియజేశారు.

# జిల్లా స్థాయి క్రీడల్లో మెరిసిన ఎంజేపీ విద్యార్థులు





### 11 పతకాలు సాధించి, ఐదుగురు రాష్ట్ర స్థాయికి ఎంపిక
### ఎం జె పి ప్రిన్సిపాల్ స్వప్న

**దౌల్తాబాద్, అక్టోబర్ 14 (ప్రజాస్వరం):**

మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే (ఎంజేపీ) పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభతో జిల్లా స్థాయి క్రీడల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో మెదక్, సంగారెడ్డి పట్టణాల్లో సోమవారం నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14, అండర్-19 విభాగాల లో పాల్గొని మొత్తం 11 పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి క్రీడలకు అర్హత పొందిన విద్యార్థులుగా అండర్-14 విభాగంలో విష్ణు వర్ధన్, దేవీదాస్, భాను ప్రసాద్, గణేష్, గిరీష్ మరియు అండర్-19 విభాగంలో భరత్, జశ్వంత్ ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో స్థానిక విలేకరులతో సమావేశంలో ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ, "మా విద్యార్థులు గ్రామీణ ప్రాంతం నుండి రాష్ట్రస్థాయి క్రీడలకు అర్హత సాధించడం ఎంతో గర్వకారణం. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల క్రమశిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహం కారణంగానే ఈ విజయం సాధ్యమైంది. రాబోయే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని నమ్మకం ఉంది" అని తెలిపారు.విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు సాయి కృష్ణ, బస్వరాజ్, డాంబు ప్రత్యేక శిక్షణతో సిద్ధం చేసినట్లు తెలిపారు. పాఠశాల , కళాశాల ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు. క్రీడల్లో సత్తా చాటిన గ్రామీణ విద్యార్థులు - ఎంజేపీ పాఠశాలకు గర్వకారణం

### పాము కాటుతో యువకుడి మృతి
# తల్లికి తీరని దుఃఖం

**దౌల్తాబాద్, అక్టోబర్ 14 (ప్రజాస్వరం):**

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో చోటుచేసుకున్న విషాద ఘటన గ్రామమంతా విషాదంలో ముంచేసింది. గ్రామానికి చెందిన జనగామ పుష్ప-కిష్టయ్య దంపతుల ఏకైక కుమారుడు జనగామ దయాకర్(21)పాము కాటుకు బలై ప్రాణాలు కోల్పోయాడు. వివరాల్లోకి వెళితే శనివారం సాయంత్రం తన వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా దయాకర్‌ను పాము కరిచింది. వెంటనే తల్లి పుష్ప తోటి అన్నదాతలతో కలిసి అతడిని సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి దురదృష్టవశాత్తూ మరణించాడు. దయాకర్ మరణంతో తల్లి పుష్ప కన్నీరుమునిగిపోయింది. సరిగ్గా ఇరవై సంవత్సరాల క్రితం భర్త కిష్టయ్య అప్పుల బారిన పడి ఆత్మహత్య చేసుకోవడంతో చిన్న పిల్లవాడైన దయాకర్‌ను తానే ఒంటరిగా పెంచింది. కష్టనష్టాలు తట్టుకుని కుమారుడిని పెద్దవాడిని చేసిన ఆమె ఇప్పుడు కుమారుడి మరణంతో చితికిపోయింది. అంత్యక్రియల సమయంలో తల్లి విలపిస్తూ "నా బిడ్డతో నా ప్రాణం కూడా పోయింది" అంటూ నేలపై పడిపడి ఏడవడంతో గ్రామస్థులు, బంధువులు ఆవేదనకు గురయ్యారు. ఆమెను ఆదుకునే ప్రయత్నం చేసినా బాధతో తల్లి తాళలేకపోయింది. గ్రామస్తులు మాట్లాడుతూ - "పుష్ప కష్టాలు చూసి అందరికీ కన్నీళ్లు వచ్చాయి. ప్రభుత్వం ఆమెకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలి" అని కోరారు. ఇదే సందర్భంగా తల్లి పుష్ప ఫిర్యాదు మేరకు ఎస్సై అరుణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. రైతులు, కూలీలు వ్యవసాయ పనులు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పొలాల్లో పాములు ఉండే అవకాశం ఎక్కువ ఉన్నందున కాళ్లకు బూట్లు ధరించి వ్యవసాయ పనులను కోసం ఎంచుకోవాలని అన్నదాతలకు సూచించారు. ఈ విషాద ఘటన తిరుమలాపూర్ గ్రామంలో మానవతా విలువలను కదిలించింది. తల్లి ప్రేమ, బాధ, ఒంటరితనం కలసిన ఈ దృశ్యం చూసిన ప్రతి ఒక్కరి మనసును కలచివేసింది.





### వ్యాధి నిరోధక టీకా ను సద్వినియోగం చేసుకోవాలి

**మెదక్ అక్టోబర్ 14 (ప్రజా స్వరం)**



పశువులకు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమన్ని విజయవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య తెలిపారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 152524 పశువులు ఉండగా అందులో 48,909 ఆవు జాతి గేదెలు ఉండగా, 103615 గేదె జాతి పశువులు ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా సిబ్బంది 46 బృందాలుగా ఏర్పడి వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని, ఈ నెల 15 తేదీ నుండి వచ్చే వచ్చే నెల 14 తారీకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లాలో అన్ని గ్రామాల్లో జరిగే పశువులకు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో గోజాతి, గేదె జాతి పశువులు కలిగిన రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు నెలల పైబడిన గోజాతి, గేద జాతి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం ద్వారా పశువుల సురక్షితంగా ఉంటాయన్నారు



## మాచిన్‌పల్లి మల్లన్న గుట్టపై
# చిరుత పులి సంచారం!

- ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచనలు.

**దౌల్తాబాద్ అక్టోబర్ 14(ప్రజా స్వరం)**

దౌల్తాబాద్ మండలంలోని మాచిన్‌పల్లి గ్రామ పరిధిలోని మల్లన్న గుట్ట వద్ద చిరుత పులి సంచారం చేస్తోందన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. పలు ప్రాంతాల్లో చిరుత పులి పాదచిహ్నాలు కనిపించాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు, ప్రజలందరికీ ప్రత్యేకంగా పశుపాలకులకు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పశువులను గుట్ట ప్రాంతానికి పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే పులి సంచారం నేపథ్యంలో గ్రామంలో ఆందోళన నెలకొంది. పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లకుండా ఉండాలన్న సూచనలు ఇవ్వబడ్డాయి. స్థానిక గ్రామ పెద్దలు, అంగన్వాడి సిబ్బంది, ఆశా వర్కర్లు గ్రామ ప్రజలకు సమాచారం అందిస్తూ, రాత్రి వేళ గుట్ట ప్రాంతంలోకి వెళ్ల వద్దని హెచ్చరిస్తున్నారు. అధికారుల స్పందన ఇంకా రానుండగా, గ్రామస్థులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అన్నదాతలు ప్రత్యామ్నాయ పంటలపై
# దృష్టి సాధించాలి



- -గజ్వేల్ సహాయ సంచాలకులు బాబు నాయక్.

**దౌల్తాబాద్ అక్టోబర్ 14 ప్రజాస్వరం**

రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఆయిల్ పామ్ పంటతో అధిక దిగుబడుల సాధించవచ్చని గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు బాబు నా యుయక్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో ఆయిల్ పామ్ పంట పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట సాగుపై ఉన్న సబ్సిడీలపై రైతులకు తెలపటం జరిగింది. కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు 90 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీ డ్రిప్, మొక్కలకి ఇవ్వడం జరుగుతుంది. రైతులందరూ ఆయిల్ పామ్ సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చు.పామాయిల్ చెట్లు నాటిన 14 నెలలకు పూత ప్రారంభమవుతుంది. మొక్క 30 నేలలు వయసు వచ్చేవరకు లేత దశలో మగ ఆడ పుష్పాలన తప్పనిసరిగా తొలగించాలి. తద్వారా చెట్టు యొక్క మాను (మొదలు భాగం) బాగా ఊరుతుంది.తద్వారా 36 నెలల వయసులో గెలల బరువు బాగా వస్తుంది.ఎకరానికి నికరంగా ప్రతి సంవత్సరం 10 టన్నుల పామాయిల్ దిగుబడిని పొందవచ్చు. ఐదు సంవత్సరాల తర్వాత ఆయిల్ పాములో కోకో పంట కూడా వేసుకోవచ్చు. దీనివలన అధిక లాభాలు నికరంగా ఎకరానికి లక్ష వరకు ఆదాయం పొందవచ్చు.తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలోనే మార్కెటింగ్ సదుపాయం కల్పిస్థాం. గేలలు ఫ్యాక్టరీకి సరఫరా చేసిన మూడు రోజుల్లో నగదు రైతు ఖాతాల్లో జమవుతుంది. నంగునూరు లో మండలంలో ఫ్యాక్టరీ అందుబాటులో ఉంది. సిద్దిపేట జిల్లాలో ఇప్పటి వరకు 11 వేలా ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉంది.ఆయిల్ పామ్ తోటలో మూడు సంవత్సరాల వరకు అంతర పంటలు వేసుకోవచ్చు. మొక్కజొన్న, వేరుసెనగ, పప్పు, ధనియాల వంటి అనేక పంటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చని రైతులకు వివరించడం జరిగింది. అనంతరం రైతు నాచగిరి మాట్లాడుతూ తన 3.20 ఎకరాల తోటలో కేవలం 6 నెలలోలోనే సుమారుగా రూ .1,85,000 లాభం పొందడం జరిగిందని, తన అనువలభవన్ని ,ఆయిల్ పామ్ సాగులో గల మెళకువలు, లాభాలు నికర ఆదాయం , మల్చింగ్ విధానం , నీటి సరఫరా విధాన మరియు సస్యరక్షణ చర్యలు గూర్చి పూర్తిగా వివరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, ప్లాంట్ మానిటరింగ్ ఆఫీసర్ రాములు, ఏఈవో ప్రవీణ్ ,ఫీల్డ్ అసిస్టెంట్ రాకేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్ విజన్ -2047 సర్వేలో
# ఉద్యోగులందరూ పాల్గొనాలి

**శామీర్ పేట అక్టోబర్ 14,(ప్రజాస్వరం)**

తెలంగాణా రాష్ట్రాన్ని రానున్న రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంటు ను రూపొందిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ విజన్ 2047 డాక్యుమెంట్ తయారీలో ప్రతి ఒక్క పౌరుడు భాగస్వామ్యం పొందేలా సిటిజన్ సర్వే చేపట్టారు. అక్టోబర్ 10 వ తేదీన ప్రారంభమైన ఈ సర్వేలో రాష్ట్ర ప్రజలు, ఎన్.ఆర్.ఐ లు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. కాగా, ఈ తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సర్వే లో రాష్ట్రంలోని ప్రతీ ఉద్యోగి పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిస్తూ నేడు సర్క్యులర్ జారీ చేసింది. ఈనెల 25 వ తేదీ వరకు జరిగే విజన్2047 సర్వేలో అందరు ఉద్యోగులు పాల్గొనడం తోపాటు ఈ సర్వే లింక్ ను, క్యూఅర్ కోడ్ ను తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఆ సర్క్యులర్ లో ఆదేశించారు. ఈ సర్వేలో పాల్గొనేందుకుగాను http //www.telangana.gov.in/telanganarising/ అనే లింక్ ద్వారా పాల్గొనాలని ఒక ప్రకటనలో తెలియచేసారు.



## కాలుష్యానికి కారణమవుతున్న చెట్టినాడు
# సిమెంట్ ఫ్యాక్టరీని మూసి వేయిస్తాం





- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తాండూర్ మండలం సంగెం కలాన్ గ్రామంలో పర్యటన

**వికారాబాద్, అక్టోబర్ 14 :ప్రజాస్వరం):**

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం సంగెం కలన్, మల్కాపూర్, కోటబస్పల్లి,మిట్టబస్పల్లి, గుంత బాస్పల్లి, కోత్లాపూర్ తదితర గ్రామాల పరిధిలోని వందలాది ఎకరాల పంట పొలాలను నాశనం చేస్తున్న చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీని మూసి వేయించేందుకు చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు మండలం సంగం కలాన్, మల్కాపూర్ తదితర గ్రామాల పరిధిలో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన రైతులతో కలిసి చెట్టినాడు ఫ్యాక్టరీ నిర్లక్ష వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. సంగం కలాన్ చెట్టినాడు ఫ్యాక్టరీల మధ్య ఉన్న వాగుపై వంతెన నిర్మాణంలో కూడా ఫ్యాక్టరీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. కొన్నేళ్లుగా వంతెన నిర్మాణం పనులు పూర్తి చేయకపోవడంతో వరదలు వచ్చినప్పుడల్లా రైతుల పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని అన్నారు. వారి చరిత్ర పంటలు సాగు చేస్తున్న రైతులు చెట్టినాడు ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. గత కొన్ని ఏళ్లుగా ఫ్యాక్టరీ నిర్లక్ష్యం వల్ల రైతులు భారీ ఎత్తున ఆర్థికంగా నష్టపోయారని చెప్పారు. పచ్చని పంటలు పండే ప్రాంతంలో కర్ణాటక సరిహద్దుల్లో చెట్ నాడు ఫ్యాక్టరీ నిర్మాణంతో ఈ ప్రాంత రైతులకు తీవ్ర నష్టాలు కలుగుతున్నాయని అన్నారు. రైతులు ఎన్నోసార్లు ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చలు జరిపినప్పటికీ కాలుష్యం నివారించేందుకు ,వరదలు నివారించేందుకు చర్యలు చేపట్టలేదని విమర్శించారు. చెట్టినాడు ఫ్యాక్టరీ యాజమాన్యం ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే త్వరలోనే ఫ్యాక్టరీని మూసివే ఇస్తామని ఎంపీ హెచ్చరించారు. అయితే రైతులు వరి కంది తదితర పంటలు సాగు చేసే బదులు కాలుష్యాన్ని తట్టుకునే ఆయిల్ ఫామ్ తోటలను పెంచాలని చెప్పారు. ఎస్సీ ఎస్టీ రైతులకు ప్రభుత్వం 100% సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తుందని అన్నారు. ఇతర రైతులకు కూడా 90 శాతం సబ్సిడీలు అందుతాయి అని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆయిల్ ఫామ్ తోటలకు మంచి డిమాండ్ ఉంటుందని అలాగే రైతులకు కూడా మంచి ఆర్థిక లాభాలు చేకూరుతాయని చెప్పారు. ఎంపీ వెంట బిజెపి నాయకులు బాలేశ్వర్ గుప్తా, బంటారం భద్రేశ్వర్ తదితరులు ఉన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించకుంటే ఆందోళన చేపడుతా

ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

తాండూరు మండలం సంగెం కలాన్ గ్రామ సరిహద్దుల్లో కర్ణాటక పరిధిలో ఉన్న చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఈ ప్రాంతంలో నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎకరానికి కనీసం లక్ష రూపాయల పరిహారం చెట్టినాడు ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత రైతులు తమకు జరుగుతున్న పంట నష్టం పై చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చిస్తున్న ప్పటికి రైతులకు పంట నష్టపోయిన పరిహారం మాత్రం చెల్లించడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యానికి సిగ్గుండాలని ఒక దశలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంటలు కాలుష్యం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వకుంటే ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేపడతానని హెచ్చరించారు.





# ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందిగా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశాలు జారీ

**వికారాబాద్ ,అక్టోబర్ 14 (ప్రజాస్వరం):**

వికారాబాద్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందిగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారము కలెక్టర్ చాంబర్ లో సంబంధిత అధికారులతో ఇసుక రవాణా పై సమావేశము నిర్వహించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఇసుక అక్రమ రవాణా జరగకుండా విస్తృత తనిఖీలు చేపట్టడంతో పాటు సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, రెవెన్యూ శాఖల సమన్వయంతో జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి రిపోర్ట్ ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) లింగ్యా నాయక్, జిల్లా పంచాయతి అధికారి జయసుధ, ఎ డి మైన్స్ సత్యనారాయణ , గ్రౌండ్ వాటర్ ఎ డి రవి, ఎ ఓ పర్వీన బేగం, డి సెక్షన్ సుపరింతెన్డెంట్ మున్నీర్, ఇ డి ఎం మహమూద్ , తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.








# కేంద్రంలో తాను రైల్వే మంత్రి అవుతా

- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- తాండూరులో విలేకరుల సమావేశం

**తాండూరు, అక్టోబర్ 14(ప్రజా స్వరం):**

త్వరలో తాను రైల్వే మంత్రి అవుతానని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరులో మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీగా తాను వికారాబాద్ జిల్లాలో రైల్వే సమస్యలు పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. జిల్లా లోని మర్పల్లి రైల్వే స్టేషన్లో ఇంటర్ సిటీ రైలు నిలిపేలా కృషి చేశానని తెలిపారు .అలాగే బషీరాబాద్ లో రాయలసీమ ఎక్స్ ప్రెస్ ఆపేలా రైల్వే బోర్డును కోరినట్లు తెలిపారు.కొన్ని వారాల్లోనే హుబ్లీ ఎక్స్ ప్రెస్ కూడా ఆపేలా కృషి చేస్తాననీ చెప్పారు. గతంలో కాంగ్రెస్ హాయంలో ఉన్న రైల్వే శాఖ మంత్రి ఇక్కడి రైల్వే సమస్యలపై చొరవ చూపలేదని అన్నారు. రానున్న రోజుల్లో తానే రైల్వే మంత్రి పదవిని చేపడతానని, అప్పుడు ఇక్కడ సమస్యలు అన్ని పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా హైదరాబాద్ జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో ఎంఐఎం చెప్పిన విధంగా కాంగ్రెస్ పార్టీ నడుచుకుంటుందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభావం కోల్పోయిందని, ప్రజలే ఆ పార్టీని బొంద పెడుతున్నారని అన్నారు. బీజేపీ నుంచి త్వరలోనే అభ్యర్థిని నిర్ణయిస్తారని తెలిపారు. ఉప ఎన్నికల్లో పోరాడుతామని, 90 వేలకు పైగా ఓట్లను రాబడుతామని దీమా వ్యక్తం చేశారు. మరోవైపు వికారాబాద్ జిల్లాలో బీజేపీ పార్టీలో వర్గపోరు విషయంపై అడడగా వర్గాలు మంచికేనన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు నా మనిషి అయినప్పటికీ ఆయన రాజకీయాలకు సూట్ కారని అన్నారు. ఆయన నాయకత్వాన్ని ఎవ్వరు కోరుకోవడం లేదన్నారు. ఆయన నాన్ లోకల్ అయినప్పటికి మా కుటుంబ సభ్యులే సహకారం అందించారని గుర్తుచేశారు. విభేదాలు వచ్చినా కూడా అందరిని కలుపుకోవాలని నచ్చజెప్పినా పరిస్థితిలో మార్పురాలేదని అన్నారు. జిల్లా అధ్యక్షులుగా రాజీనామా ఆయన వ్యక్తిగత విషయమని అన్నారు.






# విద్యార్థి దశలోనే చైతన్యం

- **మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించిన పోలీసులు**

**దౌల్తాబాద్, అక్టోబర్ 14 (ప్రజాస్వరం):**

దౌల్తాబాద్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు మహిళల భద్రత, రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్‌కుమార్, గజ్వేల్ షీటీమ్ బృందం పాల్గొని ర్యాగింగ్, ఇవ్‌టీజింగ్, పోక్సో చట్టం, షీటీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు మరియు నూతన చట్టాలపై వివరించారు. ఎస్ఐ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ "విద్యార్థి దశ కీలకం, జీవితంలో మళ్లీ రానిది. చదువుకునే వయస్సులో చెడు అలవాట్లకు బానిస కాకుండా, కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలి," అని సూచించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి, అపరిచితుల ఫోన్ కాల్స్, చాటింగ్ వంటి వాటికి లోనుకావద్దని హెచ్చరించారు.మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, నూతన చట్టాలతో మహిళలు, పిల్లల రక్షణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎవరైనా వేధింపులు, హింస ఎదురైతే మౌనం వీడి డయల్-100, లేదా షీటీమ్ వాట్సాప్ నెంబర్ 8712667343, మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, అధ్యాపకులు, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వంలో విద్యారంగం ప్రతిష్టాత్మకము

- **జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**శామీర్ పేట అక్టోబర్ 14,(ప్రజాస్వరం)**

ప్రజా ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిష్టాత్మంగా తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బెస్ట్ అవైలబుల్ స్కీం ప్రగతిని సమీక్షించారు.బెస్ట్ అవైలబుల్ స్కీం కింద నిధులకు సంబంధించిన ఒప్పందం పాఠశాల యాజమాన్యాలు, జిల్లా యంత్రాంగం మధ్యన జరిగింది. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే పాఠశాల యాజమాన్యాలు జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలి తప్ప విద్యార్థులను బయటికి పంపడానికి వీలులేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, డీఈవోలు, సంక్షేమ శాఖల అధికారులు ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకొని బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపికైన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యా హక్కు చట్టం, బెస్ట్ అవైలబుల్ స్కీం ఏం చెబుతుంది, పాఠశాల యాజమాన్యాలు, ప్రభుత్వ యంత్రాంగం మధ్య జరిగిన ఒప్పందంలో ఏ ఏ అంశాలు ఉన్నాయో పాఠశాలల యాజమాన్యాలను పిలిచి వివరించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కీం కింద పాఠశాలల వారీగా ఉన్న బకాయిల వివరాలను వెంటనే పంపాలని కలెక్టర్లకు సూచించారు. బకాయిల్లో కొంత మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యా, వైద్య రంగాలపై జిల్లా కలెక్టర్లు సీరియస్ గా దృష్టి సారించాలని పెండింగ్ బిల్స్ ఏమైనా ఉంటే ఆర్థిక శాఖ దృష్టికి తీసుకురావాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లకు సూచించారు. బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు రాకపోతే కొన్నిచోట్ల పాఠశాలలు మూత వేశారని సమాచారం ఉంది. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు ఎప్పటికప్పుడు రాకపోతే కొన్ని పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఉందని అధికారులు నివేదిస్తున్నారు, కేవలం బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులపై ఆధారపడితే అది ప్రముఖ పాఠశాల ఏ విధంగా అవుతుందని జిల్లా కలెక్టర్లను డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. డీఈవో లు వెంటనే అన్ని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ను సందర్శించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత ఉంది? ప్రభుత్వ నిబంధనలు సరిగా పాటిస్తున్నారా? లేదా? ఆయా పాఠశాలల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయి? వెంటనే నివేదిక సమర్పించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. గడిచిన ఏడు సంవత్సరాలుగా బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల వివరాలు సేకరించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రస్తుతం ఆ విద్యార్థులంతా ఎక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు, ఉన్నత విద్యకు వెళ్లారా ?లేదా? తదితర వివరాలు సేకరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు స్వయంగా పర్యవేక్షించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కొనసాగుతున్న పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అధికారులను కోరారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రానా, సాంఘిక సంక్షేమ శాఖ సెక్రెటరీ బుద్ధ ప్రకాశ్, సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ క్షితిజ తదితరులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ అధికారులు వినోద్ కుమార్, పద్మజా, కాంతమ్మ, డిఈఓ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- **తెలంగాణ సాంస్కృతిక సారథ కళాకారుల బృందం**
- **టీం లీడర్ ఆస రామారావు.**



**దౌల్తా బాద్ అక్టోబర్ 14 ప్రజాస్వరం**

వయోజనులందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం టీమ్ లీడర్ ఆస రామారావు అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం రామారం ఓటు హక్కు వినియోగం, పరిసరాల పరిశుభ్రత, ట్రాఫిక్ నియమాలు, డ్రగ్స్, సైబర్ నేరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాట మాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బిజ్జూరి రవి కుమార్ ఆదేశాల మేరకు రాయపోల్ మండల కేంద్రంలో ఓటు హక్కు వినియోగం, పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్ నియంత్రణ, వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకునే జాగ్రత్తలు, ప్లాస్టిక్ నిషేధం, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని వీటితోపాటు ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాల పైన ఆటపాటలతో ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించడమైనది. ఈ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం చీకోడు నర్సింలు, బిట్ల ఎల్లం, తుమ్మల ఎల్లం, సందుర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# దౌల్తాబాద్ లో పోషణ మహోత్సవం

**దౌల్తాబాద్, అక్టోబర్ 14 (ప్రజాస్వరం):**




మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని అంగన్వాడి మూడవ సెంటర్‌లో మంగళవారం పోషణ మహోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా ఐసీడీఎస్ సూపర్వైజర్ రేఖ పాల్గొన్నారు.కార్యక్రమంలో మాట్లాడుతూ సూపర్వైజర్ రేఖ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. శారీరక మరియు మానసిక ఎదుగుదలలో సమతుల ఆహారం కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, విద్య, పరిశుభ్రత, అలాగే తల్లుల సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.అదే మాదిరిగా హెల్త్ సూపర్వైజర్ అమరావతి మాట్లాడుతూ గర్భిణీలు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవడం, సమయానికి టీకాలు వేయించుకోవడం, పాలిచ్చే తల్లులు శుద్ధమైన ఆహారం తీసుకోవడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని వివరించారు. ప్రైమరీ స్కూల్ హెచ్ఎం జ్యోతి మేడం మాట్లాడుతూ బాలింతలు కిశోర బాలికలకు విద్యతో పాటు ఆరోగ్య అవగాహన కూడా అవసరమని, ప్రతి ఇంట్లో ఆరోగ్య సంరక్షణే సమాజ ప్రగతికి పునాది అని పేర్కొన్నారు.జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ నర్సింలు మాట్లాడుతూ బాలల హక్కులు, రక్షణ చట్టాలు మరియు బాలల దుర్వినియోగ నివారణ చర్యలపై వివరించారు.కార్యక్రమంలో ఆశా కార్యకర్త బాలమణి, అంగన్వాడి టీచర్లు రమాదేవి, గిరిజ, ప్రతిభ, రాధిక, సరోజ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా గర్భిణీలు, బాలింతలకు పోషకాహార పదార్థాలు పంపిణీ చేయడం జరిగింది.



# కన్నుల పండువగా శ్రీరేణుక ఎల్లమ్మ కళ్యాణం

- **కళ్యాణంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, భక్తులు**

**శామీర్ పేట, అక్టోబర్ 14 (ప్రజాస్వరం)**

శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో 8వ వార్షికోత్సవం లో భాగంగా అమ్మవారి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా యాష్కి కుటుంబ సభ్యులు, గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిపారు. ఈ కళ్యాణోత్సవంలో భాగంగా ఉదయం అమ్మవారికి ఘటం తీసుకువెళ్లారు. అనంతరం భక్తుల కోలాహలం, వేద బ్రాహ్మణుల మంత్రోశ్చరణ ల మధ్య అమ్మ వారి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి సూర్య బోనం సమర్పించారు. భక్తులు ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయానికి జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, వివిధ గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు విచ్చేసి ఎల్లమ్మ అమ్మవారును అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు.

**పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం....**

కాగా శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో 8వ వార్షికోత్సవం సందర్భంగా యాష్కి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ఎల్లమ్మ ఆలయానికి వచ్చిన భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.








# మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలి

- **ఇందిరమ్మ ఇండ్ల పనులు, హాస్టల్ పరిశీలనలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్**
- **ప్రజా సేవలపై దృష్టి, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ**

**దౌల్తాబాద్, అక్టోబర్ 14 (ప్రజాస్వరం):**



జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీమతి గరీమ అగ్రవాల్ మంగళవారం దౌల్తాబాద్ మండల పరిధిలో పలు గ్రామాలను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు.ముందుగా ఆమె దొమ్మట గ్రామ పంచాయతీని సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణం ఆలస్యమవకుండా వేగంగా పూర్తి చేయాలని సూచించారు.తరువాత హై స్కూల్ను సందర్శించిన ఆమె, అక్కడి పరిస్థితులను సమీక్షించి డ్రై డేను క్రమం తప్పకుండా నిర్వహించాలని అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు.ఆమె లింగరాజుపల్లి గ్రామంలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ "ఇళ్ళను త్వరగా పూర్తిచేసుకుని ప్రయోజనం పొందండి" అని సూచించారు.తరువాత మండల కేంద్రమైన దౌల్తాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఇవ్వాల్సిన దొండకాయ కూర స్థానంలో క్యారెట్ కూర ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, తన పీఏ ద్వారా జిల్లా విద్యాధికారికి సమాచారం అందజేసి హాస్టల్ నిర్వాహకులకు మెమో జారీ చేయాలని ఆదేశించారు. తరువాత ఆమె దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC)ను సందర్శించి ఓపి రిజిస్టర్ పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్య తలెత్తినా వెంటనే స్పందించి సమయానికి వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి లింగస్వామి, ఎంపీడీవో గఫర్ ఖాద్రి, తహసీల్దార్ చంద్రశేఖర రావు, ఎంఈఓ గజ్జల కనకరాజు,ఎంపీవో దౌల్తాబాద్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రజా సేవలు, విద్యా, ఆరోగ్య రంగాల పట్ల కలెక్టర్ కృషి ప్రశంసనీయంఆమె పర్యటన విద్యార్థులలో బాధ్యతాభావాన్ని, గ్రామ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.





# హర్యానాలో మరో పోలీస్ అధికారి ఆత్మహత్య

- **చనిపోయిన పూరన్ కారణమంటూ సూసైడ్ లేఖ**



**చండీఘడ్,అక్టోబర్14(ప్రజాస్వరం):**

హరియాణాలో ఇటీవల సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించిన సంగతి మరవక ముందే...తాజాగా మరో పోలీసు అధికారి తనను తాను తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. పూరన్‌ను లక్ష్యంగా చేసుకుని ఆ అధికారి తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఏఎస్సై సందీప్‌కుమార్ రోహ్‌తక్ సైబర్ సెల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పూరన్ కుమార్‌పై ఉన్న ఓ అవినీతి కేసును ఆయన దర్యాప్తు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పూరన్ కుమార్‌పై తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేశారు. నిజాలు వెలుగులోకి రావడం కోసం తన జీవితాన్ని త్యాగం చేస్తున్నట్లు రాశారు. పూరన్ కుమార్ ఇటీవల చండీగఢ్‌లోని తన నివాసంలో రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుల వివక్ష, వేధింపులు, అవమానాలతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు ఆయన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. ఇందులో ఎనిమిది మంది అధికారుల పేర్లను చేర్చారు. ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించింది. రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాను బదిలీ చేసింది. ఈ క్రమంలో తాజాగా ఓ ఎఎస్సై ఆత్మహత్య చేసుకోవడం, అందుకు పూరన్ కారణమంటూ పేర్కొనడం కలకలం రేపుతోంది.

# పూరన్ ఆత్మహత్యపై సత్వర దర్యాప్తు

- **పూరన్ ఆత్మహత్యపై సత్వర దర్యాప్తు**
- **ఉన్నతస్థాయిలో కూడా దళితులకు స్వేచ్ఛ కరవు**
- **పూరన్ కుటుంబ సభ్యులకు రాహుల్ పరామర్శ**



**చండీఘడ్,అక్టోబర్14(ప్రజాస్వరం):**

హరియాణాలోని సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పూరన్ కుమార్ కుటుంబాన్ని కలిశారు. ఈ సందర్భంగా పూరన్‌కు నివాళులర్పించిన ఆయన.. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. అనంతరం రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ..ప్రభుత్వాధికారిపై ఇలాంటి వివక్ష చోటుచేసుకోవడం విషాదకరమన్నారు. ఈ కేసుకు సంబంధించి స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విచారణ జరుపుతామని స్వయంగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ హామీ ఇచ్చారన్నారు. కానీ, రోజులు గడుస్తున్నా.. అది నెరవేరటం లేదని విమర్శించారు. తండ్రిని పోగొట్టుకున్న పూరన్‌కుమార్ ఇద్దరు పిల్లలు చాలా ఒత్తిడిలో ఉన్నారన్నారు. పూరన్ కుమార్ కెరీర్‌ను, ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇతర అధికారులు సంవత్సరాలుగా వివక్ష కొనసాగించారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇది కేవలం ఒక దళిత కుటుంబానికి సంబంధించినది కాదని, దేశంలోని కోట్లాది మంది దళితులకు సంబంధించినదని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారిపై జరిగిన వివక్ష దళితులుగా ఎంత విజయం సాధించినా.. అణచివేత తప్పదనే తప్పుడు సందేశం వారికి వెళ్లేలా చేస్తుందన్నారు. పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ, సీఎంలను డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంపై ఉన్న ఒత్తిడిని తొలగించాలన్నారు. ఇక, ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించిన సంగతి తెలిసిందే. బ్యూరోక్రసీ, పోలీస్ వ్యవస్థలో కుల వివక్ష ఉందనే ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఆయన ఆత్మహత్యపై తక్షణం స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరపాలని, ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ఐపీఎస్ అధికారి కుటుంబానికి సంబంధించినదని కాదని, కోట్లాది దళితుల ఆత్మ గౌరవానికి సంబంధించినదని అన్నారు. పూరన్ కుమార్ అక్టోబర్ 7న రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎనిమిది పేజీల సూసైడ్ నోట్‌లో హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజర్నియాతో సహా పలువురు పేర్లు ఆయన ప్రస్తావించారు. కుల వివక్ష, మానసిక వేధింపులు, పబ్లిక్‌లో అవమానించడం వంటి చర్యలకు వీరు పాల్పడ్డారని ఆరోపించారు.





# రిజర్వేషన్లు బీసీల హక్కు

- **ఎవరి దయాదాక్షిణ్యాలతో**
- **ఇచ్చేవి కావు**
- **కొన్ని పార్టీలవి**
- **రెండు నాల్కల ధోరణి**
- **తెలంగాణ జనసమితి**
- **అధ్యక్షుడు కోదండరాం**

**హైదరాబాద్,అక్టోబర్14, ప్రజాస్వరం :**



రిజర్వేషన్లు బీసీల హక్కు అని, ఎవరి దయా దాక్షిణ్యాల మీద ఇచ్చేవి కాదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం అన్నారు. జనాభా దామాషా పద్దతిలో వారికి రావాల్సిన హక్కు ఉందన్నారు. ఎంతోకాలంగా వారు రాజకీయంగా అవకాశాలు అందిపుచ్చుకోలేక పోతున్నారని అన్నారు. రిజర్వేషన్లు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపగలవని అన్నారు. మానత్వపు పునాదులపై కొత్త సమాజం ఏర్పాటు చేసేందుకే అవి ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధన కోసం ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వర్‌రావు నేతృత్వంలో ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సంఘాలతో కలిసి ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. రిజర్వేషన్ల అంశంపై కొన్ని పార్టీలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయి. కేసులు వేసిన వ్యక్తులకు మద్దతు తెలుపుతూ.. బీసీలకు అన్యాయం జరిగిందని ప్రచారం చేస్తున్నాయి. తెజసకి రెండు నాలుకల ధోరణి లేదు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు తెలుపుతుంది. కేంద్రంపైన ఒత్తిడి తీసుకొచ్చి బీసీ బిల్లును ఆమోదించేందుకే మా పోరాటం అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ర్యాలీలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహిస్తామని తెజస ఉపాధ్యక్షుడు పీఎల్. విశ్వేశ్వర్‌రావు అన్నారు. సుప్రీం కోర్టులో న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. 16న గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లపై తెజస పలు తీర్మానాలు చేసింది. బీసీ సంఘాలు 18న నిర్వహించే బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించింది. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడంలో న్యాయం లేదని ఎంపీ, బీసీ రిజర్వేషన్ల సాధన సమితి కన్వీనర్ ఆర్. కృష్ణయ్య తెలిపారు. స్టే ఇవ్వడం ద్వారా బీసీల నోటికాడ ముద్దను లాక్కుందని వ్యాఖ్యానించారు. బీసీల వాదన వినకుండా కోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందన్నారు.



# తప్పిపోయిన పిల్లల కోసం నోడల్ అధికారులు

- **కేంద్రానికి సుప్రీం ధర్మాసనం ఆదేశం**

**న్యూఢల్లీ,అక్టోబర్14(ప్రజాస్వరం):**

తప్పిపోయిన పిల్లల కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మిస్సింగ్ కేసుల పర్యవేక్షణకు ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నోడల్ అధికారులను నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్టాల్లో పిల్లల మిస్సింగ్, అక్రమ రవాణాపై 'గురియా స్వయం సేవి సంస్థాన్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈమేరకు ఆదేశాలిచ్చింది. తప్పిపోయిన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి నియమించిన నోడల్ అధికారుల వివరాలను ఆన్‌లైన్ సహా అన్ని మాధ్యమాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందుకోసం ఒక పోర్టల్ రూపొందించి... దానిలో అన్ని వివరాలు పొందుపరచాలని ఆదేశించింది. పోర్టల్‌లో అదృశ్యమైన పిల్లల గురించి ఫిర్యాదు అందిన వెంటనే నోడల్ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. పోర్టల్‌లో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా పిల్లలను కిడ్నాప్ చేసే నేరస్థులపై కేసులు నమోదు చేసి..తగిన చర్యలు తీసుకోవచ్చని సూచించింది.




# దుర్గాపూర్ అత్యాచార ఘటన

- **ముగ్గురునిందితులతో పాటు, సహకరించిన వ్యక్తి అరెస్ట్**
- **నిందితుడి సోదరి ఇచ్చిన సమాచారంతో అరెస్ట్**

**కోల్‌కతా,అక్టోబర్14(ప్రజాస్వరం):**



పశ్చిమబెంగాల్‌లో తీవ్ర కలకలం రేపిన ఒడిశాకు చెందిన ఓ వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన కేసులో అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు నిందితులతో పాటు వారికి సహకరించిన మరో యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు పారిపోయేందుకు సహకరించిన మరో యువకుడిని మంగళవారం అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. నిందితుడి సోదరి ఇచ్చిన సమాచారంతోనే పరారీలో ఉన్న అతడిని గుర్తించినట్లు పోలీసులు వెల్లడిరచారు. ఐదో నిందితుడు సఫీక్ దుర్గాపుర్‌లోని అందాల్ వంతెన కింద దాక్కున్నట్లు అతడి సోదరి రోజినా తమకు సమాచారం ఇవ్వడంతో అతడిని పట్టుకున్నట్లు తెలిపారు. తన సోదరుడు చేసిన తప్పునకు తగిన శిక్ష అనుభవించాలనే ఉద్దేశంతోనే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు రోజినా మీడియాకు తెలిపింది. అత్యాచార ఘటనపై బాధితురాలు మాట్లాడుతూ భయానక క్షణాలను గుర్తు చేసుకుంది. శుక్రవారం రాత్రి తన స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లినప్పుడు పలువురు దుండగులు తమను వెంబడిరచినట్లు తెలిపింది. వెంటనే తాము అడవి వైపు పరిగెత్తుతున్న సమయంలో తన స్నేహితుడు మరో వైపునకు వెళ్లగా..నిందితులు తనను బలవంతంగా అటవీప్రాంతంలోకి లాక్కెళ్లినట్లు పేర్కొంది. ఫోన్‌ను లాక్కొని తన స్నేహితుడికి కాల్ చేయాలని బెదిరించారని.. అతడు రాకపోవడంతో తనపై దారుణానికి పాల్పడ్డారని వెల్లడిరచింది. తాను ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తుండగా..అరిస్తే మరికొంతమందిని పిలుస్తామని నిందితులు బెదిరించారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ ఘటనలో ఐదుగురు నిందితులను కస్టడీలోకి తీసుకొని..విచారిస్తున్నట్లు వెల్లడిరచారు. నిందితులను ఘటనా స్థలానికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

# సుప్రీంలో అనుకూల తీర్పు రావచ్చు

- **హైకోర్టు తీర్పు తమకు నిరాశ కలిగించింది**
- **ఎస్‌ఎల్‌పి విచారణ రేపు వచ్చే ఛాన్స్**
- **మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడి**

**న్యూఢల్లీ,అక్టోబర్14(ప్రజాస్వరం):**

పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్‌ఎల్‌పీ గురువారం నాడు విచారణకు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు అన్ని పార్టీలు మద్దతిచ్చాయని, ఇప్పుడు మాట మారుస్తున్నాయని అన్నారు. ఇదిలావుంటే బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పీ) దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఈ నెల 9వ తేదీన హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ఈ ఎస్‌ఎల్‌పీ పిటిషన్ వేసింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధిస్తున్నట్లు రాజ్యాంగంలో ఎక్కడా నిబంధనలు లేవని ఎస్‌ఎల్‌పీలో తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టు మాత్రమే దాన్నో మార్గదర్శక సూత్రంగా నిర్దేశించిందనీ పిటిషన్ లో పేర్కొంది. ప్రత్యేక సందర్భాల్లో రిజర్వేషన్లు కల్పించవచ్చని ఇందిరా సాహ్ని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతమేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం తెలంగాణలో జరిగిందని.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే 2024`25లో రాష్ట్ర జనాభాలో 56.33శాతం మంది బీసీలు ఉన్నారని తెలిపింది. రాహుల్ రమేశ్ వాఘ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. తమిళనాడు గవర్నర్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తావించింది. ప్రభుత్వం శాసనసభలో ఆమోదించి పంపిన బిల్లులకు మూడు నెలల్లోపు గవర్నర్ ,రాష్ట్రపతి ఆమోదం తెలపకపోతే వాటికి ఆమోదముద్ర వేసినట్లుగానే భావించాల్సి ఉంటుందని.. ఈ విషయాలను పరిగణలోకి తీసుకోవాలంటూ పిటిషన్ లో పేర్కొంది. న్యాయం తమవైపు ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. సుప్రీంలో తప్పకుండా అనుకూల తీర్పు వస్తుందని అన్నారు.



# జూబ్లీహిల్స్ లో బిఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు

- **మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరిక**

**హైదరాబాద్,అక్టోబర్14(ప్రజాస్వరం):**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో భారత రాష్ట్ర సమితి గూబ గుయ్యిమనేట్లు ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ ఉప ఎన్నికలో ఆ పార్టీ చిరునామా గల్లంతవుతుందని జోస్యం చెప్పారు. పదేళ్లలో ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్‌లో ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఓడగొట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పారు. జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్ల నమోదుకు భారత రాష్ట్ర సమితి, భాజపాలదే బాధ్యతని అన్నారు. మాగంటి సునీతతో కన్నీరు పెట్టిస్తూ.. గులాబీ పార్టీ ఓట్లు దండుకోవాలని చూస్తోందని పొన్నం విమర్శించారు. ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గట్టి బుద్ధి చెప్పబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి పరంగా ఏ మాత్రం ముందుకు సాగలేదని, ఇప్పుడు ప్రజలే ఆ విఫలతకు తీర్పు ఇవ్వబోతున్నారని అన్నారు. పదేళ్ల పాలనలో అభివృద్ధి పేరుతో ఒక్క రోడ్డు సరిచేయలేని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఓట్ల కోసం నటన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే ఆ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలకూ ప్రజలు సరైన పాఠం చెప్పబోతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈసారి ఓటర్లు మోసపోవడం లేదని తీవ్ర విమర్శలు గుప్పించారు.




# తుమ్మల, పొన్నంలకు మానవత్వం ఉందా

- **మాగంటి సునీతను అవమాన పరుస్తారా**
- **మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్**

**హైదరాబాద్,అక్టోబర్14(ప్రజాస్వరం):**

మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లకు మానవత్వం ఉందా? వాళ్లు మనుషులేనా? అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఆడబిడ్డ అయిన మాగంటి సునీతను అవమానించడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గోపన్న అమర్ రహే అంటుంటే, తన భర్త గోపినాథ్‌ను గుర్తు చేసుకొని మాగంటి సునీత ఏడుస్తుంటే డ్రామా అంటారా తుమ్మల నాగేశ్వరరావు? కమ్మ సామాజిక వర్గం ఓటు వేస్తే గెలిచిన తుమ్మల, అదే వర్గానికి చెందిన నేత గోపినాథ్ సతీమణిని డ్రామా అంటారా? అని ప్రశ్నించారు. మాగంటి సునీతకు మంత్రుల వ్యాఖ్యలు తీవ్ర మనస్తాపం కలిగించాయని, వారు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రుల మాటలను తెలంగాణ ఆడబిడ్డలు గమనించాలి అని ఆయన వ్యాఖ్యానించారు. యువకుడు..అలాగే, ప్రెస్ మీట్ సమయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి మంత్రుల పక్కనే కూర్చున్నా, ఆడబిడ్డ అవమానింపబడుతుండగా మౌనంగా ఉన్నారని గౌడ్ విమర్శించారు. రాజీవ్ గాంధీ చనిపోయినప్పుడు పార్టీలకతీతంగా అందరం బాధ పడ్డామని, ఇప్పుడు మాగంటి సునీత తన భర్తను గుర్తుచేసుకొని ఏడుస్తుంటే దాన్ని డ్రామా అంటారా? ఇది సిగ్గుచేటు అని మండిపడ్డారు. మాగంటి సునీత భావాలను దెబ్బతీసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.



ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక
15.10.2025
బుధవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.


# మీసాల పిల్ల అదుర్స్..



మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రం నుండి మొదటి పాట వచ్చేసింది. ఇప్పటికే అద్భుతమైన స్పందనతో రికార్డు వ్యూస్ సాధించిన ప్రోమో తర్వాత, 'మీసాల పిల్ల' పూర్తి లిరికల్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాట సంగీత ప్రియులను, మెగా అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రముఖ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ 'మీసాల పిల్ల' పాట పవర్‌ఫుల్ ఎలక్ట్రానిక్ బీట్స్, పంచ్ బాస్ లైన్స్‌తో మాస్, మెలోడీ కలగలిపిన ఓ అద్భుతమైన ట్రాక్‌గా నిలిచింది. భాస్కరభట్ల అందించిన సాహిత్యం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చాలా కాలం తర్వాత మెగాస్టార్ సినిమా కోసం ప్రముఖ గాయకుడు ఉదిత్ నారాయణ్ గొంతు కలపడం ఈ పాటలో అతిపెద్ద హైలైట్. ఆయన నోస్టాల్జిక్ వాయిస్ పాటకు కొత్త వైబ్ ఇచ్చింది. శ్వేతా మోహన్ గాత్రం మరింత మాధుర్యాన్ని జోడించింది.

ఈ పాటలో మెగాస్టార్ చిరంజీవి తన ట్రేడ్‌మార్క్ గ్రేస్, స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్‌తో అదరగొట్టారు. చార్మింగ్, స్టైలిష్ సూట్‌లో ఆయన కనిపించిన తీరు అభిమానులకు కనుల పండుగ చేసింది. విజయ్ పోలాకి కొరియోగ్రఫీలో చిరంజీవి వింటేజ్ డ్యాన్స్ స్టైల్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. అందమైన చీరలో నయనతార మెరిసిపోగా, చిరంజీవినయనతార మధ్య కెమిస్ట్రీ మ్యాజికల్‌గా ఉంది. కలర్‌ఫుల్ సెట్స్ మధ్య చిత్రీకరించిన ఈ పాట విజువల్ ట్రీట్‌గా నిలుస్తోంది. హిట్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సుష్మిత కొణిదెల భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తున్నారు. సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్ అందిస్తున్నారు. మొత్తంమీద సంగీతం, సాహిత్యం, కొరియోగ్రఫీ, లీడ్ పెయిర్ కెమిస్ట్రీ అన్నీ కలిసి 'మీసాల పిల్ల' పాటను ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా నిలబెట్టాయి. 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం 2026 సంక్రాంతికి థియేటర్లలో విడుదల కానుంది.


# రాశీ ఖన్నా ఖాతాలో మరో మెగా హీరో..?



మల్టీటాలెంటర్ రాశీ ఖన్నా థాంక్యూ తర్వాత టాలీవుడ్‌లో కనిపించలేదు. బాలీవుడ్, కోలీవుడ్ అంటూ తచ్చట్లాడుతోంది కానీ తెలుగు ప్రేక్షకులను పట్టించుకోవడం లేదు. నీరజా కోన దర్శకత్వంలో మూడేళ్ల తర్వాత తెలుసు కదాతో మళ్లీ టాలీవుడ్ కెరీర్ బూస్టప్ అవుతుందని గట్టిగానే నమ్ముతోంది ఈ ఢిల్లీ డాళ్.

హిందీలో బిజీగా ఉన్న టైంలో ఊహించని విధంగా పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ ఆఫర్ వచ్చింది రాశీకి. పవర్ స్టార్ సినిమా అనగానే కథ వినకుండా ఎగిరి గంతులేసి సెట్‌లో వాలిపోయానని చెప్పుకుంటున్న రాశీ ఖన్నా ఆనందానికి అవధుల్లేవు. ఇప్పటి వరకు తారక్ మినహా టైర్ 1 హీరోలతో జోడీ కట్టిన దాఖలాలు లేవు అమ్మడు. అందులోనూ మెగా హీరోతో వర్క్ అంటే ఆమెకు కలిసొస్తూ ఉంటుంది. సుప్రీమ్, తొలి ప్రేమ, ప్రతి రోజు పండుగ చిత్రాలు కమర్షియల్ హిట్స్‌గా నిలిచాయి. ఇప్పుడు పవన్ కళ్యాణ్‌తో సినిమా అంటే మరో మెట్టు ఎక్కినట్లే భావిస్తోంది మేడమ్. అయితే మరో లక్కీ ఛాన్స్ రాశీని వెతుక్కుంటూ వచ్చిందన్నది లెటెస్ట్ బజ్. వాల్తేరు వీరయ్య కాంబో మళ్లీ రిపీట్ కాబోతోంది. మెగాస్టార్ చిరంజీవిని మరోసారి డీల్ చేసే గోల్డెన్ ఛాన్స్ కొల్లగొట్టాడు బాబీ. కెవిఎన్ ప్రొడక్షన్స్ భారీగా తెరకెక్కించబోతుంది. మన శంకర్ వర ప్రసాద్ గారూ కంప్లీట్ అయ్యాక చిరు ఈ ప్రాజెక్టుకు షిఫ్ట్ కాబోతున్నారు. ఇందులో ఇద్దరు హీరోయిన్లను పరిశీలిస్తున్నాడట బాబీ. అందులో బెల్లం శ్రీదేవి అలియాస్ రాశీ ఖన్నాతో పాటు మాళవిక మోహనన్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే మేడమ్ పంట పండినట్లే.

# కొంపముంచిన ప్రదీప్ రంగనాథ్.. ప్రభాస్ కొత్త సినిమా లీక్ ?






పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. కృష్ణంరాజు వారసత్వాన్ని అందుకొని టాలీవుడ్ ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ప్రభాస్, అంచెలంచెలుగా ఎదిగారు. బాహుబలి సినిమా తర్వాత ప్రభాస్ రేంజ్ ప్రపంచ స్థాయికి వెళ్ళింది. ప్రభాస్ ఏ సినిమా తీసినా పాన్ ఇండియా రేంజ్ లో రిలీజ్ కావాల్సిందే. అయితే అలాంటి ప్రభాస్, హనుమ రాఘవపూడి దర్శకత్వంలో ఓ పిరియాడికల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తున్న సినిమా చేస్తున్నారు. ఈ సినిమాలో ఇమాన్వి హీరోయిన్‌గా చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ మూవీకి ఫౌజీ అనే టైటిల్ పెట్టారని కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. కానీ అధికారిక ప్రకటన మాత్రం ఇప్పటి వరకు బయటకు రాలేదు. ఇలాంటి నేపథ్యంలో తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమా గురించి లీకులు ఇచ్చాడు. డ్యూడ్ సినిమా ప్రమోషన్ ఈవెంట్ లో పాల్గొన్న ప్రదీప్... ఫౌజీ సినిమా గురించి కీలక విషయాలు బయట పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మా నిర్మాతలు నాకు ప్రభాస్ మూవీ ఫౌజీ క్లిప్పింగ్స్ చూపించారని తెలిపాడు. అవి చాలా అద్భుతంగా ఉన్నాయని ఈ సందర్భంగా వెల్లడించారు. దీంతో ప్రభాస్ సినిమాకు ఫౌజీ టైటిల్ ఫిక్స్ అయిందని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి.

# అన్ని ఉద్యోగాలు వేరు.. నటన వేరు



ఇటీవల సెలబ్రిటీ టాక్ షో 'టూ మచ్'లో బాలీవుడ్ నటి కాజోల్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. నటీనటులు ఒత్తిడికి గురవుతారని తెలుపుతూ కార్పొరేట్ ఉద్యోగస్తులతో పోల్చారు. ఈ అంశం తీవ్ర చర్చకు దారితీసింది. తాజాగా ఆమె తన వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చారు. ప్రతి వృత్తిని తాను గౌరవిస్తానని తెలిపారు. ''అన్ని ఉద్యోగాలు వేరు, నటన వేరు. షూటింగ్ సమయంలో నటీనటులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. మేం 'ది ట్రయిల్' రెండో సీజన్ కోసం ఒక ప్రాంతానికి వెళ్లాం. 40 రోజులు విరామం లేకుండా చిత్రీకరించాం. ఆ రోజుల్లో మేం ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. సరిగ్గా తినాలి. ఎప్పుడూ ఒకే లుక్‌లో ఉండాలి. అలా ఉండడం చాలా ఒత్తిడిగా ఉంటుంది. ఇది మిగతా ఉద్యోగులకు ఉండదు. ఆ ఉద్దేశంతోనే నేను పోలిక చెప్పాను'' 'ఆఫీసులలో ఉన్నట్లు నటీనటులకు బ్రేక్ టైం ఉండదు. 9 నుంచి 5 వరకూ ఉద్యోగం చేసేవారు మధ్యలో టీ బ్రేక్ తీసుకోవచ్చు. లేదంటే కొంత సమయం విశ్రాంతి తీసుకోవచ్చు. యాక్టర్స్ అలా చేయలేరు. షూటింగ్‌లో విరామ సమయంలో కూడా అందరి కళ్లు నటీనటుల పైనే ఉంటాయి. నవ్వినా, కదులుతున్నా, కూర్చున్నా.. ఏం చేసినా ప్రతిక్షణం పరిశీలిస్తూనే ఉంటారు'' అని కాజోల్ తెలిపారు.

# ఏజెంట్ మిర్చిగా మారిన శ్రీ లీల



ప్రస్తుతం తెలుగు ఇండస్ట్రీలో అత్యంత బిజీగా ఉన్న హీరోయిన్లలో శ్రీ లీల ఒకరు. వరుసగా టాప్ హీరోలతో సినిమాలు చేస్తూ, సక్సెస్‌లు–ఫ్లాప్స్‌తో సంబంధం లేకుండా తన కెరీర్‌ను సూపర్ స్పీడ్‌లో నడిపిస్తున్న ఈ యంగ్ బ్యూటీ.. తాజాగా అభిమానులను ఆశ్చర్యపరిచే ఒక సర్ప్రైజ్ ఇచ్చింది. తాజాగా శ్రీలీల తన సోషల్ మీడియాలో ఓ క్రేజీ పోస్టర్ షేర్ చేసింది. అందులో ఆమె "ఏజెంట్ మిర్చి" అనే కొత్త లుక్‌లో కనిపించింది. స్టైలిష్ బ్లాక్ అవుట్‌ఫిట్, కూల్ గాగుల్స్, చేతిలో గన్‌తో ఉన్న ఆమె ఫోటో చూస్తే ఇది సాధారణ ప్రాజెక్ట్ కాదనిపిస్తుంది. ఫ్యాన్స్ మాత్రం "ఇది కొత్త సినిమా పోస్టరా? లేక ఓ వెబ్ సిరీస్ ప్రమోషనా?" అని గెస్ గేమ్ మొదలుపెట్టారు. అలాగే శ్రీలీల ఈ పోస్టర్‌తోపాటు, "October 19న అసలు సీక్రెట్ రివీల్ అవుతుంది" అంటూ హింట్ ఇవ్వడంతో ఆసక్తి మరింత పెరిగింది. దీంతో అభిమానులు ఆ రోజు కోసం కౌంట్‌డౌన్ మొదలుపెట్టేశారు. మరోవైపు వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఇది ఒక హిందీ ప్రాజెక్ట్ కావచ్చని టాక్. పాన్ ఇండియా స్థాయిలో శ్రీలీలకు కొత్త అడుగు పడనుందని టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. ఇటీవలే తెలుగుతో పాటు తమిళం, కన్నడ, హిందీ భాషల్లోనూ ఆఫర్లు అందుకుంటున్న శ్రీలీలకు ఈ కొత్త ప్రాజెక్ట్ కెరీర్ టర్నింగ్ పాయింట్ కావచ్చని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తానికి.. "ఏజెంట్ మిర్చిగా మారిన శ్రీలీల" అనే ఈ కొత్త లుక్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక అక్టోబర్ 19న ఈ రహస్యం బయటపడే వరకు ఫ్యాన్స్ ఎదురుచూడాల్సిందే!

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999